

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 97 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 గురువారం19 జూన్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




1959 - 2024

దివంగత షఫీఉల్లా ఖాన్

మాజీ మేనేజింగ్ ఎడిటర్

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

**-జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్-డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని వెల్లడి**

**-తెలంగాణ రైజింగ్‌లో గూగుల్ తోడ్పాటు అవసరమన్న సిఎం**

హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి)

ప్రపంచం మొత్తం డిజిటల్ యుగంగా మారుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉన్నట్లే అని చెప్పారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని చెప్పారు. 'గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం. నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశాం. ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతోందని ఈ సందర్భంగా అన్నారు.. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ మారాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నాం



అన్నారు. ఇక్కడి మహిళలు ధనిక పెట్టుబడి దారులకు పోటీదారులుగా మారుతున్నారు. ప్రభుత్వం లో నూతన ఆవిష్కరణలు, విధా నాలు తీసుకొచ్చాం'అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గూగుల్ మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను ప్రారంభించడం సంతోషంగా ఉంద న్నారు. ఇది ప్రపంచంలో ఐదవది మాత్రమే అని తెలిపారు. గూగుల్ ప్రారంభిం చినప్పటి నుంచి ప్రపంచం మారి పోయిం దని.. నేడు మన జీవితాలు పూర్తిగా డిజిటల్‌గా మారాయన్నారు. గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నామని తెలిపారు. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్‌గా మారాయి. డిజిటల్ సురక్షితంగా ఉంటే, మనం మరింత అభివృద్ధి చెందుతామని చెప్పుకొచ్చారు. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్ సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగి స్తున్నందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. ఇది నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెడుతుందన్నారు. ఉపాధిని సృష్టించడంతో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్ధాంతమని.. ఈ విధానాన్ని తాను ఇష్టపడు తున్నట్లు తెలిపారు. గూగుల్‌లా, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని నమ్ముతున్నానన్నారు. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపి స్తాయని..

మిగతా 2లో

## ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

### జి7 సదస్సులో ప్రధాని మోడీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ,జూన్ 18(సమయజ్యోతి):

ఉగ్రవాదం ఎక్కడున్నా, ఏ రూపంలో ఉన్నా అది మానవాళికి ప్రధాన శత్రువని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కెనడాలో జరిగిన జీ7 సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని బహిరంగంగా సమర్థించే దేశాలు తగిన మూల్యం చెల్లించు కుంటాయని హెచ్చరించారు. ఏప్రిల్‌లో జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి మాన వత్వంపై జరిగిన దాడిగా మోదీ అభి వర్ణించారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు



చోటు ఉండకూడ దన్నారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువు. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టే అన్ని దేశాలు దీన్ని వ్యతిరేకించాలి. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం మన ఆలోచనలు, విధానాలు స్పష్టంగా ఉండాలి. ఏదైనా దేశం ఉగ్రవాదానికి మద్దతిస్తే అందుకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మోదీ పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు అనిశ్చితి, సంఘర్షణలతో ఎక్కువగా బాధపడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. ఆహారం, ఇంధనం, ఎరువులు, ఆర్థిక సంక్షోభాలతో ముందుగా దెబ్బతినేది వారేనన్నారు. గ్లోబల్ సౌత్‌లో నెలకొన్న ఆందోళనలు, ప్రాధాన్యతలను ప్రపంచ వేదికపై లేవనెత్తడాన్ని భారత్ తన బాధ్యతగా భావిస్తోందన్నారు. ఇక, ప్రధాని డీప్‌ఫేక్ గురించి కూడా మాట్లాడారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్న మోదీ.. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌పై వాటర్ మార్కింగ్ లేదా స్పష్టమైన గుర్తు ఉండాలన్నారు. ఈ శతాబ్దంలో సాంకేతికతపై పరస్పర సహకారం అవసరమన్నారు. కృత్రిమ మేధస్సు చుట్టూ ఉన్న ఆందోళనలను

మిగతా 2లో



2లో.

## పోలవరం-బనకచర్లతో తెలంగాణకు అన్యాయం

- బనకచర్లపై కేంద్రానికి ఫిర్యాదు
- నేడు ఢిల్లీలో కేంద్రమంత్రిని కలవనున్న సిఎం
- ఎంపిలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఉత్తమ్

హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి):

బనకచర్ల విషయంలో ఏపి దూకుడుకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ మేరకు గురువారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌ని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల నేతృత్వంలోని బృందం కలవనుంది. బుధవారం సాయంత్రం గోదావరి-బనకచర్లపై ఎంపిలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశానికి సిఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపిలు, బిజెపి ఎంపిలు డికె అరుణ, రఘునందన్ రావు, బిఆర్ఎస్ ఎంపి రవిచంద్ర, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ..

## బనకచర్లతో వచ్చే నష్టమేమిటో ఉత్తమ్‌కు ఎంపి అర్వింద్ సూటిప్రశ్న

హైదరాబాద్,జూన్ 18(సమయజ్యోతి):

బనకచర్లతో తెలంగాణకు జరిగే అన్యాయ మేంటో చెప్పమంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దగ్గర సమాధానం లేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. డైవర్షన్ రాజకీయాల కోసం ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమం పెట్టారని విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భాజపా భరోసా కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలను

మిగతా 2లో



## గోదావరి వృథా జలాలను వాడుకోవాల్సిందే

**-ఆనాడు కెసిఆర్ అభిప్రాయం కూడా ఇదే**

**-బనకచర్లకు తరలించలన్న ప్రతిపాదన సమ్మతం కాదు**

**-బిసి రిజర్వేషన్ల కోసం 17న రైల్‌రోకో-ఎమ్మెల్సీ కవిత వెల్లడి**

హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి):

తెలంగాణ రాజకీయాల్లో హీట్ పెరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆమె, ముఖ్యమంత్రి చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి, సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. 'బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు నష్టం జరగదని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు చెబుతుండగా, గోదావరి జలాలను తరలించేందుకు కేసీఆర్ అప్పుడు ఒప్పుకున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. కేసీఆర్ గోదావరి నీళ్లు సముద్రంలో వృథాగా పోకుండా వాడుకలోకి తేవాలని మాత్రమే అన్నాడు. కానీ, నదుల అనుసంధానం అంశానికి ఎప్పుడూ ఓకే చెప్పలేదు అని ఆమె వివరణ ఇచ్చారు. ఏపీ కోసం చంద్రబాబు పోరాటం చేస్తున్నారని చెబుతున్నారు. అలా అయితే మన సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు? చంద్రబాబుతో రేవంత్‌కు ఉన్న లాలూచీ ఏమిటి? అని ప్రశ్నించారు. నల్లమల టైగర్ అంటూ కాదు, పని చేసి చూపించండి 'రేవంత్ రెడ్డి నల్లమల టైగర్ అంటూ చెప్పుకుంటున్నారు. అది నిజమే అయితే బొల్లపల్లి రిజర్వాయర్ ప్రాజెక్ట్‌ను నిలిపివేయాలి. లేదంటే, మీరు కేవలం పేపర్ పులి అని ప్రజలకు తేటతెల్లం అవుతుంది,' అంటూ సెటైర్లు వేశారు. 'ఢిల్లీకి హాఫ్ సెంచరీ కొడుతున్నారు కానీ బీసీల కోసం అడగడంలేదు. బీసీ బిల్లు గురించి మోదీని అడగాలి,' అని స్పష్టం చేశారు. బీసీలకు రాజకీయం హక్కులు లభించేలా కేంద్రం వెంటనే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ, జులై 17న రైలు రోకో నిర్వహిస్తామని ప్రకటించారు. ఢిల్లీకి వెళుతున్న సీఎం.. బీసీ బిల్లు పట్టుకుని తిరిగి హైదరాబాద్‌కు రావాలి అంటూ హెచ్చరించారు.



2లో.




## సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వడం కుదరదు

### ఎసిబికి లేఖ ద్వారా కెటిఆర్ స్పష్టీకరణ

హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి):

సెల్‌ఫోన్ అప్పగించాలన్న అంశంపై ఏసీబీ నోటీసుకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ లేఖ ద్వారా సమాధానం పంపారు. తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే ఈ చర్యను అంగీకరించేది లేదని తెలిపినట్లు సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో కేటీఆర్ విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు. సెల్‌ఫోన్ స్వాధీనం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చించారు. అనిశా అధికారులు ఆదేశించినట్లుగా మొబైల్ ఫోన్‌ను, ల్యాప్‌టాప్‌ను వారికి ఇవ్వాల్సిన అవసరం లేదని న్యాయవాదులు కేటీఆర్‌కు చెప్పినట్టు సమాచారం.



## ఇక ఫాస్టాగ్ పాస్‌లు రానున్నాయి

**-3వేల పాస్‌తో 200 ట్రిప్పులు ఫ్రీ-కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన**

న్యూఢిల్లీ,జూన్ 18(సమయజ్యోతి):

ఫాస్టాగ్ యూజర్లకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. కేవలం రూ. 3వేలు రీచార్జ్‌తో ఫాస్టాగ్ వార్షిక పాస్ అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. ఈ పాస్ తీసుకుంటే 200 ట్రిప్పుల వరకు ప్రయాణించే అవకాశం ఉన్నట్లు ఈ మేరకు కేంద్ర మంత్రి గడ్కరీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాదికి రూ. 3వేలు రీచార్జ్ చేసుకుని దేశంలో ఎక్కడైనా తిరిగే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆగష్టు 15 నుంచి ఈ విధానాన్ని అమలులోకి తీసుకువస్తున్నట్లు గడ్కరీ ప్రకటించారు. ఇక ఈ పాస్ దేశవ్యాప్తంగా ఏ రహదారిపైన

మిగతా 2లో

# ప్రాథమిక ఉపాధ్యాయులకు హెచ్ఎం పదోన్నతులు కల్పించాలి: టీఎస్పీటీఏ

**హైదరాబాద్, జూన్ 18:సమయజ్యోతి**

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో హెడ్‌మాస్టర్ (%ూా ఎవీ%) ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్పీటీఏ) డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన పది వేల హెచ్ఎం పోస్టుల భర్తీకు సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరింది. టీఎస్పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ, ప్రధాన కార్యదర్శి ఆర్. రోహిత్ నాయిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం నూతన విద్యాశాఖ కమిషనర్ అనిల్ నికోలస్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిసింది. ఈ సందర్భంగా వారు విద్యా రంగంలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించారు."65,000 మందికి పైగా ప్రాథమిక ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుండగా, 10,000 భాషా పండితుల పోస్టులను మాత్రమే మంజూరు చేసి, పదోన్నతుల ద్వారా వారికే అవకాశాలు కల్పించడం అన్యాయంగా ఉంది," అని నాయకులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పది వేల హెచ్ఎం పోస్టులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా, అమలు చేయకుండా మోసం చేసిందని పేర్కొన్నారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవి చేపట్టిన నేత హెచ్ఎం పదోన్నతులపై హామీ ఇచ్చినందున, ఆర్థిక శాఖ నుండి పరిపాలనా అనుమతి తీసుకుని వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని టీఎస్పీటీఏ నేతలు విజ్ఞప్తి చేశారు.అలాగే, బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని, ఇంకా భర్తీ కాని రెండు జోన్లలోని గ్రేడ్-11 హెచ్ఎం పోస్టుల భర్తీను కూడా తక్షణమే చేపట్టాలని వారు కోరారు.ఈ అంశాలపై కమిషనర్ అనిల్ నికోలస్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ముఖ్యమంత్రితో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ సమావేశంలో టీఎస్పీటీఏ అసోసియేట్ అధ్యక్షురాలు ఆర్. మంగా, పి. సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి: జస్టిస్ చంద్రకుమార్

**హైదరాబాద్, జూన్ 18, 2025:సమయజ్యోతి**

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని జస్టిస్ చంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు."ఉద్యమకారులు, నిరుద్యోగులతో చెలగాటం ఆడటం నిప్పుతో ఆడినట్లు అవుతుంది. త్యాగాలు చేసిన వారికి గౌరవం ఇవ్వకపోతే ప్రజాస్వామ్యం అర్థం కోల్పోతుంది," అని ఆయన అన్నారు.

### జస్టిస్ చంద్రకుమార్ ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలుగా పేర్కొన్నారు:

**- ఉద్యమకారులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి**

**- విద్యార్థులు, ఉద్యమకాలంలో కేసులు ఎదుర్కొన్న వారిపై కేసులు ఎత్తివేయాలి - అమరుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు మరియు నెలకు ?25,000 పెన్షన్ కల్పించాలి- ఉద్యమకారుల గుర్తింపు కోసం చట్టబద్ధమైన కమిటీ నియమించాలి- శారీరకంగా నష్టపోయిన వారికి, ఉద్యోగ వయస్సు మించిపోయిన వారికి ఉపాధి కల్పించాలి- ఆరోగ్య భద్రత కోసం ఉద్యమకారులకు ?25 లక్షల వరకు ఆరోగ్య బీమా- బస్సులు, రైళ్లలో ఉచిత ప్రయాణం - ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్- నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు**

ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పాశం యాదగిరి, విమలక్క, సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ వెన్నెల గద్దర్ పాల్గొని మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం అనేక ఉద్యమాలు జరిగాయని, నక్సలైట్లు ప్రాణ త్యాగాలు చేశారని గుర్తుచేశారు. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా భూ పంపిణీ, పారిశుధ్య సమస్యలు, ఫార్మా కంపెనీల కాలుష్యం, ఓపెన్ కాస్ట్ మైనింగ్ వంటి అంశాల్లో ప్రగతి జరగలేదన్నారు.వారు ఉద్యమకారులు ఇకపై రాజకీయ యుద్ధానికి సిద్ధం కావాలని, ప్రజల కోసం పని చేయాలంటే రాజకీయ అధికారమే మార్గమని స్పష్టం చేశారు.ఈ సమావేశానికి వెన్నపూజ పరుషరాజు అధ్యక్షత వహించగా, బత్తుల సిద్ధేశ్వర్లు, పసునూరి రవీందర్, మన్నారం నాగరాజు, పటేల్ వనజ, ఏటిగడ్డ అరుణ, అంబు రాథోడ్, బుల్లెట్ వెంకన్న, డాక్టర్ చీమ శ్రీనివాస్, గోధుముల కుమారస్వామి, చాపర్తి కుమార్ గాడ్గే, సోహర బేగం, కోలా జనార్ధన్ గౌడ్, రామగిరి ప్రకాష్, సింగారపు అరుణ, కొంగర నరహరి, పోత సునీత, మందల వరలక్ష్మి, దురిశెట్టి వెంకటలక్ష్మి, తాటికొండ సద్గుణ, సాదం రాజన్న, సుజ్జి, సాయిరాం, కేడెల ప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# కేంద్రమంత్రి ఖట్టర్‌తో కిషన్ రెడ్డి భేటీ

## మెట్రో విస్తరణ

## తదితర అంశాలపై చర్చ

**న్యూఢిల్లీ,జూన్18(సమయజ్యోతి):**

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో శ్రమ్ శక్తి భవన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల స్థితి గురించి చర్చించారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులకు కేంద్ర ప్రభుత్వ సహకారం అంశంపై చర్చ జరిగింది. మెట్రో ఫేజ్-2 కోసం తెలంగాణ ప్రభుత్వం పంపించిన డీపీఆర్ ఇటీవలే అందిందని ఖట్టర్ తెలిపారు. ఈ డీపీఆర్‌ను మంత్రిత్వశాఖ అధికారులు పరిశీలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డీపీఆర్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ఈ డీపీఆర్ రూపొందించి ఉంటారని ఖట్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాభివృద్ధికి కేంద్రం నిరంతరం సహకారం అందిస్తుందని ఆయన వెల్లడించారు.

మొదటిపేజీ తరువాయి

# ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

## జి7 సదస్సులో

## ప్రధాని మోడీ స్పష్టీకరణ

పరిష్కరించి, ఆవిష్కరణలు ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన నేపథ్యంలో మోదీ కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో సహా పలువురు ప్రపంచ నాయకులను కలిశారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

మొదటిపేజీ తరువాయి

# పోలవరం-బనకచర్లతో తెలంగాణకు అన్యాయం

పోలవరం-బనకచర్ల విషయంలో ఎపి విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తోందని అన్నారు. ఎపి రిపోర్టుపై స్పందించాలని కేంద్రం తమని అడిగిందని తెలిపారు. పూర్తిస్థాయి నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని ఉత్తమ్ పేర్కొన్నారు. తను, సిఎం ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర అభ్యంతరాలను తెలుపుతామని స్పష్టం చేశారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు తెలంగాణ నీటి హక్కులకు పెద్ద దెబ్బ అని తెలిపారు. ఈ ప్రాజెక్టును పరిశీలించడం అంటే రాష్ట్ర హక్కులను కాలరాయడమే అని అన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును తిరస్కరించాలని కేంద్రానికి స్పష్టంగా చెప్పామని వెల్లడించారు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డును బనకచర్ల ప్రాజెక్టు ఉల్లంఘిస్తుందని.. తెలంగాణకు అనుకూలమైన ఇచ్చంపల్లిని ఎపి వ్యతిరేకించిదని మండిపడ్డారు. అత్యవసరంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరామన్నారు. తెలంగాణ వాటా 968 టిఎంసిలలో కట్టుకొనే ప్రాజెక్టులను ఎపి వ్యతిరేకించిందని.. బనకచర్ల వల్ల మన వాటా జలాలకు కూడ భవిష్యత్తులో ఎదురుదెబ్బ తగులుతుందని అన్నారు. పూర్తయిన ప్రాజెక్టులకు అధిక కేటాయింపులను భవిష్యత్తులో ఎపి అడుగుతుందని పేర్కొన్నారు. దీనిపై కేంద్రానికి జనవరి 22న అభ్యంతరాలను చెప్పామన్నారు. అయితే ఎపి నుంచి డిపిఆర్ అందలేదని కేంద్రం సమాధానం ఇచ్చిందని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

మొదటిపేజీ తరువాయి

అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టిపెట్టి పనిచేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడికి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుంద న్నారు. సెర్చ్‌లో మొదటి లింక్ హైదరాబాద్ వస్తుందని సీఎం రేవంత్ అన్నారు. దీనిని తెలంగాణ రైజింగ్ అని పిలుస్తామని... 2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయా లను కుంటు న్నట్లు చెప్పారు. 1 కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలను కుంటున్నట్లు తెలిపారు. గూగుల్ ఆఫీస్ పక్కన రెండున్నర ఎకరాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశామని..

రైతులను సంపన్ను లుగా తయారు చేయడంతో పాటు సంతో షంగా ఉంచాలను కుంటున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచడంతో పాటు వారికి ఉపాధి కల్పిం చాలని అనుకుంటున్నట్లు చెప్పారు. అందుకు గూగుల్ మద్దతు కావాలని.. తెలం గాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబా సిడర్లుగా కావాలని కోరుకుంటున్నా మన్నారు. గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులన్నారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. దాదాపు 7,000 మంది గూగుల్ ఉద్యోగులు నేడు హైదరాబాద్‌ను తమ ఇల్లుగా భావిస్తున్నా రన్నారు. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం ఇలా అనేక రంగాలలో గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నామన్నారు. గూగుల్ ఒక వినూత్న సంస్థ, తమది ఒక వినూత్న ప్రభుత్వమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించినట్లు చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వాలు ట్రాన్సజెండర్స్‌ని నిర్లక్ష్యం చేశాయన్నారు. జీహెచ్ఎంసీ కూడా వివిధ పనుల కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించు కుంటోందన్నారు. నాణ్యమైన విద్య తమ లక్ష్యమని.. ఇందుకోసం యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకువస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ప్రతీ సంవత్సరం 1.10 లక్షల ఇంజనీర్స్ కాలేజ్‌ల నుంచి వస్తున్నారని... చాలా మంది విద్యార్థులకు నైపుణ్యం ఉండడం లేదన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందరికీ ఆరోగ్యం తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇవే తన ప్రధాన ఆవిష్కరణలన్నారు. 'గూగుల్ లాగానే, నా ప్రభుత్వంలో భాగస్వాములైన మహిళలు, యువత, రైతులు, పేదలు, మధ్యతరగతి, సీనియర్ సిటిజన్లు, పిల్లలకు ఉన్నతమైన జీవన ప్రమాణాలు కల్పించాలని కోరుకుంటున్నాను. మనం కలిసి గొప్ప ప్రమాణాలను సృష్టిద్దాం. హైదరాబాద్‌లో మీ కొత్త సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు మరోసారి అభినందిస్తున్నాను. మేం గర్వపడేలా మీరు పనిచేస్తారని విశ్వసిస్తున్నాను' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత గూగుల్ మొదలుపెట్టిన రెండో సెంటర్ ఇది. ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఇది ఐదవది కావడం గమనార్హం.

మొదటిపేజీ తరువాయి

# ఇక ఫాస్టాగ్ పాస్‌లు రానున్నాయి

## -3వేల పాస్‌తో 200 ట్రిప్పులు

## ఫ్రీ-కేంద్రమంత్రి

## నితిన్ గడ్కరీ ప్రకటన

ప్రయాణించినా చెల్లుబాటు అవుతుంది. దేశంలో జాతీయ రహదారులపై నిర్బంధ రహిత ప్రయాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. వాణిజ్యేతర, వ్యక్తిగత వాహనాలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఎక్స్ లో పేర్కొన్నారు. ఫాస్ట్‌ట్యాగ్ అనేది ఒక చిన్న ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ సిస్టమ్. ఇది రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ సాంకేతికతను ఉపయోగించి వాహనాల టోల్ రుసుములను ఆటోమేటిక్‌గా చెల్లించడానికి వీలు కల్పిస్తుంది. దీనిని వాహనం విండ్‌స్క్రీన్‌పై అటాచ్ చేసుకుంటారు. టోల్ ఎ÷-లాజాల వద్ద ఎక్కువ సేపు ఆగకుండా టోల్ చెల్లించడానికి అనుమతిస్తుంది. అయితే, ఈ ఇయర్ పాస్‌తో టోల్ ఎ÷-లాజాల వద్ద వేచి ఉండే సమయం తగ్గిపోతుంది. దీంతో ప్రయాణం మరింత సులభతరం అవుతుంది. అంతేకాకుండా ఆర్థికంగా కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

# కేంద్రమంత్రి ఖట్టర్‌తో కిషన్ రెడ్డి భేటీ

## మెట్రో విస్తరణ తదితర అంశాలపై చర్చ

**న్యూఢిల్లీ,జూన్18(సమయజ్యోతి):**


కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో శ్రమ్ శక్తి భవన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల స్థితి గురించి చర్చించారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులకు కేంద్ర ప్రభుత్వ సహకారం అంశంపై చర్చ జరిగింది. మెట్రో ఫేజ్-2 కోసం తెలంగాణ ప్రభుత్వం పంపించిన డీపీఆర్ ఇటీవలే అందిందని ఖట్టర్ తెలిపారు. ఈ డీపీఆర్‌ను మంత్రిత్వశాఖ అధికారులు పరిశీలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డీపీఆర్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ఈ డీపీఆర్ రూపొందించి ఉంటారని ఖట్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాభివృద్ధికి కేంద్రం నిరంతరం సహకారం అందిస్తుందని ఆయన వెల్లడించారు.

# బనకచర్లతో వచ్చే నష్టమేమిటో

## ఉత్తమ్‌కు ఎంపి అర్వింద్ సూటిప్రశ్న

మొదటిపేజీ తరువాయి

స్వీకరించాం. అనేక మంది దివ్యాంగులు వచ్చి తమ సమస్యలు తెలిపారు. వారికి ఇచ్చిన హమీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. ప్రతి ఫ్లలెలో కాంగ్రెస్ ఇమేజ్ భూస్థాపితం అయింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సగం కాంగ్రెస్.. సగం భారాస. కేసీఆర్ డైరెక్షన్‌లో తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఆయన చేస్తున్న పని పవర్ పాయింట్ ప్రజంటేషన్. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే నాటకాలాడుతున్నారు. భాజపాపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. నన్ను సిట్ పిలవలేదు. మహేశ్‌కుమార్ గౌడ్ ఫోన్ ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడం లేదని అర్వింద్ వ్యాఖ్యానించారు.



# ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం

## బాలిలో దిగకుండానే వెనక్కి మళ్లిన విమానం

**న్యూఢిల్లీ,జూన్18సమయజ్యోతి**

తూర్పు ఇండోనేసియా లోని లెవోటోబి లకిలకి అగ్నిపర్వతం బద్దలవ్వడంతో దానికి సమీపంలో బాలికి వెళ్లే ఎయిరిండియా విమానం వెనక్కి మళ్లింది. అక్కడి నుంచి తిరుగుపయనమైన విమానం బుధవారం ఢిల్లీకి సురక్షితంగా చేరుకున్నట్టు అధికారులు పేర్కొన్నారు. దీంతో భారత్, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి బాలికి వచ్చే పలు అంతర్జాతీయ విమానాలను రద్దు చేసినట్టు తెలిపారు. అగ్నిపర్వతం విస్ఫోటనం కారణంగా ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని తూర్పు ఇండోనేషియా లోని నుసా టెంగారా ప్రావిన్స్ లోని విమానాశ్రయాన్ని మూసివేసినట్టు వెల్లడించారు. తూర్పు నుసా టెంగారా ప్రావిన్స్ లోని లెవోటోబి లకిలకి పర్వతం మంగళవారం విస్ఫోటనం చెందడంతో దాదాపు 11 కిమీ ఎత్తులో బూడిద ఎగసిపడినట్టు వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం అగ్నిపర్వతంలో మళ్లీ విస్ఫోటనం సంభవించడంతో 1 కిమీ ఎత్తులో దట్టమైన బూడిద ఎగసిపడుతున్నట్టు తెలిపారు. ఈ విస్ఫోటనం కారణంగా అగ్నిపర్వతం సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు స్థానిక విపత్తు నిర్వహణ సంస్థ అధికారి అవీ హల్లన్ తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చివరిసారిగా ఈ ఏడాది మేలో లకిలకి పర్వతం పలుమార్లు బద్దలయ్యిందని తెలిపారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు -కలెక్టర్ అభిలాష అభినవ్

సమయజ్యోతి న్యూస్,

నిర్మల్ బ్యూరో, జూన్ 18.

ఇల్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ నిర్మల్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. కడెం మండలం లింగాపూర్ గ్రామంలో కొందరు గ్రామస్తులు ఇందిరమ్మ ఇండ్ల కోసం ధర్నా చేసిన విషయంపై స్పందిస్తూ ఆమె ప్రకటన విడుదల చేశారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులైన నిరుపేదలను గుర్తించి దశలవారీగా ఇండ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జాబితాలో లేనివారిలో అర్హులు ఉంటే, వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ పునరుద్ఘాటించారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పేదలకు వరం డిసిసి అధ్యక్షుడు శ్రీహరి రావు

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో

జూన్ 18.

నిర్మల్ జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 135 మంది లబ్ధిదారులకు 45 లక్షల 64 వేల రూపాయలసీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను డిసిసి అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ%ౌ%ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే, నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సీఎంఆర్ఎఫ్ ఫండ్ నిధులను పంపిణీ చేస్తోందని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్స చేసుకోలేనీ ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందనీ, సీఎం రిలీఫ్ ఫండ్ ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమం నందు పిసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎంబడి రాజేశ్వర్ ని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం నందు మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఏఎంసి చైర్మన్ భీమ్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాజిద్ అహ్మద్ ఖాన్, ఏఎంసీ చైర్మన్ సారంగపూర్ అబ్దుల్ హాదీ, మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అతీఖ్ అహ్మద్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అయ్యన్నగారి పోశెట్టి, నాయకులు సబా కలీం, మొయినుద్దీన్,ఎహతేషాముద్దీన్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# త్రివేణి సంగమం వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలించిన పోలీస్ కమిషనర్

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, రెంజల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కందకుర్తి వద్ద గల త్రివేణి సంగమం నది పరివాహక ప్రదేశాలను, భద్రత ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారీ స్థాయిలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిజామాబాదు, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని నీటి పరివాహక ప్రాంతాల్లో నదులు, కాలువల ప్రాంతాల్లో మొక్కులు తీర్చుకోవడానికి, స్నానాలు చేయడానికి వచ్చే ఇరుగుపొరుగు రాష్ట్రాల భక్తులకు భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఏసీపి, సీఐ, ఎస్ హెచ్ఓ, ఎస్ఐలకు ఆదేశాలు ఇచ్చారు. ఈత రాకపోవడం వలన నదిలో మునిగి పోయే అవకాశం ఉంది. త్రివేణి సంగమం వద్ద గజ ఈతగాళ్లని అందుబాటులో ఉంచాలని, ఘాట్ల వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని, భక్తులెవరో లోపలికి ప్రవేశించకుండా



ఇరువైపులా తాళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఏసీపి శ్రీనివాస్, ఎస్సైలు డి. విజయ్ బాబు,కె. చంద్ర మోహన్ ఆయన వెంట పాల్గొన్నారు.

# ఏపుగా పెరిగిన ముండ్ల పొదలతో ఇబ్బందులు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రం నుండి ఇత్వార్ పేట గ్రామానికి వెళ్లే చెరువు కట్ట రోడ్డుపై ముండ్ల పొదలు ఏపుగా పెరిగాయి. దాంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపుల పెరిగిన ముండ్ల చెట్లను తొలగించాలని అధికారులను కోరుతున్నారు.



# ప్రైవేట్ పాఠశాలలకు.. ఎంఈఓ షోకాజ్ నోటీసులు జారీ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండలంలో ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారనీ విద్యార్థి సంఘాలు ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించి, మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు షోకాజు నోటీసులు అందజేసినట్లుగా బుధవారము ఎంఈఓ బట్టు రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన పాఠశాలలపై ఉన్నతాధికారులకు నివేదించి ఆయా పాఠశాలలను సీజ్ చేస్తామన్నారు.

# 97,841 మంది రైతుల ఖాతాల్లో 73 కోట్ల రైతు భరోసా నిధులు జమ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

జిల్లాలోని అన్నదాతలకు రైతు భరోసా కింద
మూడు రోజుల్లో రూ. 73 కోట్లకు పైగా డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఖరీఫ్ వానాకాలం సీజన్ సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ రోజు వరకు జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 97,841 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.73,85,58,689 డబ్బులు జమ అయ్యాయని పేర్కొన్నారు.



# మంత్రి వివేక్ వెంకటస్వామికి సన్మానం

సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సచివాలయంలో మంత్రి వివేక్ వెంకట్ స్వామిని బుధవారం జహిరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేశ్ కుమార్ షెట్కార్, కామారెడ్డి డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ఆపరేషన్ కగార్‌దే పైచేయి !

ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగి అగ్రనేతలు ముగ్గురు నేలకొరిగారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. మొత్తంగా అగ్రనేతలు అంతా హతమువుతన్నారు. కేంద్రం ఏదైతే కోరుకుంటుందో అదే జరుగుతోంది. నిజానికి పీపుల్స్ వార్ రాకతోనే గ్రామాల్లో పెత్తందారీ వ్యవస్థ అంతరించింది. దొరల సామ్రాజ్యానికి చెక్ పడింది. గడీల పాలన అంతమొందింది. ఊర్లో భూస్వాముల అఘాయిత్యాలు ఆగాయి. రాజకీయ నేతల దూకుడు తగ్గింది. ఏదైనా పనిచేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు. కానీ ఇప్పుడు రాజకీయ నాయకుల పెత్తనం పెరిగింది. భయమన్నది లేకండా పోయింది. అఇకారంలోకి వచ్చి భూములను కబ్జా చేస్తున్నారు. అప్పనంగా అమ్ముకుంటున్నారు. తప్పుడు పనులు చేసే రాజకీయ నాయకులకు, బూకబ్జాదారులకు పీపుల్స్ వార్ హయాలో భయం ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. ఎందుకంటే దళాలను చుట్టుముట్టి మట్టుబెడుతున్న కారణంగా మావోలు అంతరించి పోతున్నారు. ముఖ్యంగా మావోలను అంతమొందించాలని కేంద్రం కంకణం కట్టుకుంది. ఈ సమయంలో ఇక చర్చలకు తావు లేదన్న విధంగా కేంద్రం మొండిగా ఉంది. మావోలపైనే ఎందుకనో దూకుడుగా వ్యవహరిస్తోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కానీ, మణిపూర్‌లో అల్లర్లు అణచివేయడంలో కానీ ఇంత దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరి స్తోందని మహాధర్నాలు పలువురు నేతలు విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని పలువురు విమర్శించారు. అణచి వేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న వారు గళమెత్తారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని కూడా అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్య నైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని ,నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే..ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోలతో చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమన మేనని శాశ్వత పరిష్కారం కాదని గుర్తు చేశారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ,అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా ..నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని కూడా విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. అణిచి వేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే అని విమర్శించారు. మొత్తంగా ఇప్పుడు కేంద్రం అనుకున్న విధంగా మావోలు అంతమొందించే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. అయితే దోపిడీ ఉన్నంతకాలం పోరాటం ఉంటుంది. రాజకీయ దోపిడీ ఉంటే తిరుగుబాటు తప్పదని చరిత్ర రుజువు చేసింది. రాజకీయ దోపిడీని అరికట్టాలి. జబ్బుకు చికిత్స చేయడం కన్నా అసలు జబ్బులే రాకుండా నిరోధించ గలగడం ముఖ్యమని వైద్యశాస్త్రంలో చెబుతారు. అందుకోసం కృషి చేయడం మంచిది. సమాజంలో ఉత్పన్నమయ్యే అశాంతికి, ఇతర సమస్యలకు పరిష్కారం చూపకుండా కేవలం మావోలను అణచివేస్తే సమస్య సమిసి పోదని గుర్తించాలి.

# వామ్మో వీధి కుక్కల హల్ చల్

సమయజ్యోతి ప్రత్యేకం




ఉభయ తెలుగు రాష్ట్రాలలో వీధి కుక్కలు హల్ చల్ చేస్తున్నాయి పాదాచారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వీధి కుక్కలు ఎన్నో ఉన్నాయి వీదుల్లో కుక్కలు స్వైరవిహారం,హల్ చల్ చేస్తూ పాదాచారులను కరచడమే పనిగా పెట్టుకోవడం అత్యంత ఆందోళనకరం!ఈ మధ్యకాలంలో నగరాలు,గ్రామాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసిన అయా కాలనీల్లో వీధి కుక్కలు %ం% పెంపుడు శునకాలు ఒక అడ్డు అదుపు లేకుండా చాలా తీవ్ర స్థాయిలో స్వైరవిహారం,హల్ చల్ చేస్తూ వీదుల్లో సంచరించే పాదాచారులను, ఆటలాడుకునే పసిపిల్లలను,వృద్ధులను వెంటాడి, వెంబడిస్తూ వాటిని కసితీరా కరుస్తూ,కాటు వేస్తూ ఏకంగా వారి ప్రాణాలతో చెలగాటమాడుతుండటం అనేది నిత్య కృత్యం కావడం అత్యంత ఆందోళన కలిగించే విషయం.ఈ వీధి కుక్కల దాడులను అరికట్టాలంటే వాటిని ఏనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాలకు తరలించి వాటికి రేబిస్ టీకాలు వేయించి శస్త్రచికిత్స చేయించాల్సిన కొంతమంది స్థానిక అధికారులు అంటే గ్రామ పంచాయితీ లేక నగర మున్సిపాలిటీ సిబ్బంది వారు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ చోద్యం చూస్తుండటం నిజంగా అత్యంత బాధాకరమైన విషయం.పైగా ఇలాంటి ఉదాసీనత ధోరణి అనేది వారి"భాధ్యతారాహిత్యానికి ఓ నిదర్శనం కూడా.అంతేకాదు ప్రపంచవ్యాప్తంగా కుక్కకాటు వల్ల ఏటా 59 వేలమంది మృత్యువాత పడుతుండటం,అందులో 36 % శాతం మేర భారతీయులే ఉండటం ఎంతైనా తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం.అదేమాదిరి కుక్కకాటు వల్ల సంక్రమించే రేబిస్ వ్యాధి వల్ల సగటున ప్రపంచవ్యాప్తంగా ఏటా 20 వేల మంది అశువులు భాస్తున్నారు అంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారు అయ్యిందో మనం ఇట్టే ఊహించవచ్చు.అంతేకాదు నిత్యం మనం ఏ వార్తపత్రిక తిరిగేసిన ఏదో మూలాన కుక్కకాటు వల్ల ఏ పసిపిల్లవాడో,ఏ వృద్దులు,వృద్దురాల్లో,ఏ సామాన్య పాదాచారులో గాయాల పాలు కావడం లేదా కాలం కర్మ చాలి వారిలో ఏ ఒక్కరో మరణించడం సైతం ఒక్కోసారి జరుగుతూ ఉంటుండటం తీవ్ర శోచనీయమైన విషయం.అదేమాదిరి అయా నగరాలలోని,గ్రామాలలోని హెూటళ్ళు,మాంసం దుకాణాల యజమానులు ఏ మాత్రం పద్ధతి పాడులేకుండా మిగిలిన వ్యర్థపదార్థాలను వీదుల్లో పడవేయడం అవి కాస్త ఎడాపేడా అరగించిన కుక్కలు అదుపుతప్పి పాదాచారులమీద,ఇంటి ముందు ఆటలాడుకునే పసిపిల్లల మీద,వృద్దులమీద తమ తడాఖా చూపుతూ అత్యంత అమానుషంగా,కిరాతకంగా దాడులు చేస్తూ అత్యంత క్రూరంగా వారి పిక్కలను పట్టి కోరుకుతుండటం మూలాన వీధుల్లో పాదాచారులు ఏదైనా పని నిమిత్తం బయటకు వచ్చి తిరగాలంటేనే తీవ్ర భయభ్రాంతులకు గురి అవుతున్నారు అనే మాట సత్య దూరం కాదు. కాబట్టి అత్యంత జవాబుదారీ తనంతో,బాధ్యతాయుతంగా వ్యవహరించి హెూటళ్ళు,మాంసం దుకాణాల"జమానులపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన గురుతరబాధ్యత గ్రామ పంచాయితీ అధికారులపై,అయా నగరాల మున్సిపల్ కమీషనర్ లపై ఎంతైనా ఉంది.ఇంకాచెప్పుకుంటూ పోతే ప్రమాదవశాత్తు కుక్కకాటుకు ఎవరైనా గురి అయినప్పుడు సామాన్య ప్రజలు చికిత్స కోసం మొదట తలుపు తట్టేది అయా గ్రామాల,నగరాలలో వున్న ప్రభుత్వ దవాఖానాలను,ఆసుపత్రులను మాత్రమే.ఎందుకంటే వారు శస్త్రచికిత్స కోసమని ప్రైవేట్ ఆసుపత్రులకు పోయే ఆర్థిక స్థోమత వారికి ఉండదు కాబట్టి.అయితే అక్కడ సైతం ఒక్కొక్కసారి రేబిస్ నియంత్రణ టీకాలు లభించక,సరి అయినంత స్టాక్ లేక వారు తీరా తెప్పించేలోపు ఒక్కొక్కసారి కుక్కకాటుకు గురిఅయిన వారి ప్రాణాలు సైతం అనంతవాయువుల్లో కలిసిపోయే ప్రమాదకర పరిస్థితులు అప్పుడప్పుడు మన కళ్ళముందు సాక్షాత్కరిస్తూ ఉంటాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏదిఏమైన ఇప్పటికయినా అయా గ్రామాల పంచాయితీ సిబ్బంది,నగరాల మునిసిపల్ సిబ్బంది నిద్రాణావస్థ నుంచి తక్షణమే మేల్కొని వీధుల్లో విచ్చలవిడిగా సంచరించే కుక్కలను వ్యానుల ద్వారా సత్వరమే ఏనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాలకు తరలించి వాటికి శస్త్రచికిత్స అందించి మరీ వాటిని తిరిగి వదిలేయాల్సిన గురుతర బాధ్యత,తక్షణ కర్తవ్యం వారి భుజస్కంధాలపై ఎంతైనా ఉంది.ఎందుకంటే ఈ మధ్యకాలంలో వీధి కుక్కలు ఇంటి ఆవరణలో ఆటలాడుకుంటున్న చిన్న పిల్లలను వెంబడించి కరచి తీవ్రంగా గాయపరచిన సంఘటనలు కోకొల్లలుగా మనకు తరచుగా దర్శనం ఇస్తున్న నేపథ్యంలో కాస్తంతా మానవతా దృక్పథంతో వారు వ్యవహరించి,తమ వృత్తికి న్యాయం చేసేలా కాస్తంత భాధ్యతతో తమ కర్తవ్యాన్ని,భాధ్యతను నిర్వర్తిస్తే ఇలాంటి అత్యంత ప్రమాద,అపాయకరమైన వీధి కుక్కల దాడులను కొంతమేర లేదా పూర్తి స్థాయిలో అరికట్టవచ్చు.అన్నింటికి మించి ప్రజలు సైతం అత్యంత అప్రమత్తంగా వుంటూ,తమ తమ గృహలలోని చిన్నారులను ఎప్పుడు పడితే అప్పుడు ఆడుకునేందుకు రోడ్ల మీద వదలి వెయ్యకుండా కాస్తంతా రక్షణాత్మక పంథాలో వ్యవహరిస్తే ఆది వారి ఇంటికి ఒంటికి అంతా మంచిది.ఎందుకంటే ' చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకునే ' చందన కాకుండా మనల్ని మనమే ముందు జాగ్రత్తగా వీధి కుక్కల బారినుంచి కాపాడుకోవడంతో పాటు మన ఇంటిలోని అభం,శుభం తెలియని చిన్నారులను,వృద్ధులను కూడా కాస్తంతా కనిపెట్టుకొని వుంటూ ఈ వీధి కుక్కల దాడుల నుంచి వారికి ఎలాగైనా పూర్తిస్తాయి రక్షణ కల్పించాలి.అన్నింటికి మించి గ్రామ పంచాయితీ,నగర మున్సిపాలిటీ సిబ్బంది ఓ యుద్ధ ప్రాతిపదికన ఈ వీధి కుక్కలు అత్యధిక సంఖ్యలో సంచరించే అయా కాలనీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని పూర్తి స్థాయిలో ఏరిపారేయడమో లేక ఏనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాలకు తరలించి వాటికి రేబిస్ టీకాలు వేయించి,వాటికి సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు సత్వరమే చేయించి ఎటువంటి పరిస్థితుల్లో పాదాచారులకు,చిన్నారులకు,వృద్దులకు ఈ వీధి కుక్కల నుంచి ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టి మీ పవిత్ర వృత్తికి మీరు న్యాయం చేకూర్చేలా వ్యవహరిస్తే ప్రజలు మీ విషయంలో ఎంతో రుణపడి వుంటారు అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు.వీధి కుక్కలు బాబోయ్ వీధి కుక్కలు!పారా హుషార్!తస్మాత్ జాగ్రత్త

కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా తెలంగాణ సామాజిక రచయితల సంగం రాష్ట్ర అధ్యక్షులు

# నియోజకవర్గ అభివృద్ధి కి కృషి చేశా మాజీప్రోటెంస్పీకర్ భూపాల్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం



బుధవారం రామచంద్రపురం లక్ష్మీ గార్డెన్ లో పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు బీఆర్ఎస్ పటాన్చెరు నియోజక వర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి తెలియ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ శాసన మండలి మాజీ ప్రోటెం చైర్మన్ శ్రీ భూపాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రామచంద్రాపురంలో ప్రతి పేద కుటుంబానికి చెందిన పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ కళాశాల మంజూరు చేయించానని తన సొంత నిధులతో కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేసానని తెలిపారు ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా గీత భూపాల్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య బోధించబడుతోందని చెప్పారు.శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ ప్రాంగణంలో అతిథి గృహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించామని వివరించారు భూపాల్ రెడ్డి పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీనియర్ కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి తన జ్ఞాపకాలను మళ్ళీ గుర్తు చేసుకున్నారని ఆదర్శ్ రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా కార్యకర్తలు ఉత్సాహంగా పార్టీలో పరస్పరం సానుభూతి మరియు సహకారాన్ని పంచుకున్నారు ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్ గుమ్మడిదల మండలం సీనియర్ బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి తెల్లాపూర్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తులను బయటకి తీసేది యోగ

సమయజ్యోతి న్యూస్ జూన్ 18 బజార్ హత్నూర్ బోథ్



అంతర్జాతీయ యోగా దినోత్సవం యోగ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బోథ్ మండల కేంద్రంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (గర్ల్స్) సోనాల ఆయుష్ యోగా ఇన్స్ట్రక్టర్ మునిగెల యోగిత కామన్ యోగా ప్రోటోకాల్ ప్రకారం యోగ ఆసనాలు వేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యోగా ఇన్స్ట్రక్టర్ మాట్లాడుతూ నేడు యోగ విద్యార్థులకి ఎంతో ముఖ్యం అని విద్యార్థులకి మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యానికి యోగ ఎంతో ఉపయోగ పడుతుంది అని ప్రస్తుత వాతావరణంలో మార్పులు మొదలు అయినప్పుడు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది ఆ వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో శిక్షణ తరగతుల్లో అవగాహన కూడా కల్పిస్తున్నాం అని అలాగే చిన్న చిన్న విషయాలకు విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అలాంటి ఆలోచనలు రాకుండా యోగ మానసిక స్థైర్యాన్ని అందిస్తుంది అని అన్నారు...నెక్ మరియు కంటికి సంబంధించినవి, షోల్డర్ కి సంబంధించిన ఆసనాలుతాడాసనం, వృక్షాసన్, పాద హస్తాసన్, అర్ధ చక్రాసన్, త్రికోణాసన్, భద్రాసన్ , వజ్రాసన్,ఉష్ట్రాసనము వంటి ఆసనాలను విద్యార్థులచే వేయించడం జరిగింది....ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి. సంగీత మాట్లాడుతూ యోగ చేయడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది, పరీక్షల సమయంలో విద్యార్థుల ఆందోళనలు దూరం చేయడంలో యోగ ఉపయోగపడుతుంది అని జిల్లాలో ఇలాంటి యోగ కార్యక్రమాలు విద్యార్థులకి ఉపయోగపడతాయి అని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.లత, పిటి రాజ్యలక్ష్మి అధ్యాపకబృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...

# ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రైతు భరోసాతో రైతుకు పెట్టుబడి సాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్ల హర్షం వక్తం చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకాన్ని నిర్వహించారు. రైతుకు ప్రభుత్వం అన్ని విధాల అండదండలు అందిస్తుందని, రుణమాఫీ, ఉచిత విద్యుత్, నాణ్యమైన విత్తనాలు ఎరువులు, సన్నాలకు 500 బోనస్, పంటకు గిట్టుబాటు ధర అందిస్తున్నదని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, వైస్ చైర్మన్ వెలుముల రామ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొండం రాజిరెడ్డి, ఓరుగంటి తిరుపతి, పెద్దిగారి శ్రీనివాసు, కలకొండ కిషన్ రావు, ప్రశాంత్, భాను, నరేష్, ఉచ్చిడి బాల్రెడ్డి, భానుచందర్, అనమేని రాజు, దేవి రెడ్డి పాల్గొన్నారు.



# బీజేపీ కార్యవర్గం ఏర్పాటు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ బీజేపీ మండల కార్యవర్గం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులుగా అంబటి నవీన్, ఉపాధ్యక్షులుగా బూసం సత్యనారాయణ, కౌడ చిన్న భావన్న, కాల రవి, గడీల రాజేందర్, ప్రధానకార్యదర్శులుగా నక్కల గణేష్, జమిలిగిరి సాయికిరణ్, కార్యదర్శులుగా కడ్తల్ రాజేశ్వర్, గెంట్యాల సాగర్, సుంకరి చిన్నయ్య, ఐరా ప్రవీణ్, కోశాధికారిగా జక్కం శ్రీకాంత్ ఎన్నికైనారు.




# వన మహోత్సవం లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి
## -కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి**

**నిజామాబాద్ బ్యూరో**

వన మహోత్సవం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీ.ఎఫ్.ఓ వికాస్ మీనాలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా 2025 - 2026 వార్షిక సంవత్సరానికి ఆయా శాఖల వారీగా వన మహోత్సవం కింద నాటాల్సిన మొక్కలకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించారు. ఆయా శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి స్థాయిలో సాధించేందుకు చొరవ చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 545 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపల్ పట్టణాలలో మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. వన మహోత్సవంను ప్రాధాన్యత అంశంగా భావిస్తూ, నిర్ణీత గడువు లోపు లక్ష్యం పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లతో సన్నద్ధం అయి ఉండాలన్నారు. మండల ప్రత్యేక అధికారులతో పాటు, సూపర్వైజరీ అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా నర్సరీలను, వైకుంఠధామాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించాలని అన్నారు. నాటిన మొక్కల స్థితిగతులను తప్పనిసరిగా పరిశీలన చేయాలని, వన మహోత్సవం అమలు తీరును పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. నాటిన మొక్కలు ఏ స్థితిలో ఉన్నాయన్నది తెలియజేస్తూ వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు ప్రతి గ్రామ పంచాయతీని విధిగా సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించాలన్నారు. ఎక్కడైనా మొక్కలు ఎండిపోయి ఆనవాళ్లు కోల్పోతే, అందుకు గల కారణాలను అన్వేషించాలని, ఆ తప్పిదాలు మళ్ళీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు




తీసుకోవాలని హితవు పలికారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలను నాటాలని అన్నారు. గత సంవత్సరం మొక్కలు నాటిన ప్రదేశాలతో పాటు, ప్రస్తుత సంవత్సరంలో మొక్కలు నాటనున్న ప్రాంతాలలో తప్పనిసరిగా వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పచ్చదనాన్ని పెంపొందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, అప్పుడే వన మహోత్సవం లక్ష్యం సిద్ధిస్తుందని అన్నారు. కేవలం గుంతలు తవ్వి, మొక్కలు నాటి, వాటికి నీటిని అందించడంతోనే సరిపెట్టుకోకుండా, సాసరింగ్, ఫెన్సింగ్, మొక్కలకు సపోర్ట్ కర్రలను అమర్చడం వంటి వాటిపై కూడా దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. మొక్కల పెంపకం కోసం అందుబాటులో ఉన్న అన్ని వనరులు, కాంపోనెంట్ లను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఉపాధి హామీ కూలీలకు పని దినాలు ఎక్కువ మొత్తంలో లభించడమే కాకుండా గ్రామ పంచాయతీలకు కూడా ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. బ్లాక్ ప్లాంటేషన్ కు ప్రాధాన్యత ఇవ్వాలని, వచ్చే 2026 లో చేపట్టే వన మహోత్సవం కోసం ఇప్పటి నుండే నర్సరీలలో మొక్కల పెంపకం కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని, నవంబర్ నెల నాటికి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కూడా నర్సరీ నిర్వహణ చేపట్టాలని కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు. వన మహోత్సవం అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా అంకిత భావం, సమన్వయంతో పని చేస్తూ నిర్ణీత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. సమీక్షా సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మానసిక ప్రశాంతతకు దైవభక్తి అలవర్చుకోవాలి
## -ఎమ్మెల్యే జీ ఎం ఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ హరివిల్లు కాలనీలో గల శ్రీశ్రీశ్రీ హనుమాన్ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని కోరారు సీనియర్ నాయకులు ఈర్ల శ్రీకాంత్ ఆలయ కమిటీ సభ్యులు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు



# ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నూతన ఇంచార్జ్ మంత్రిని కలిసిన బోధ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్
## -ఆడే గజేందర్

**సమయజ్యోతి న్యూస్ జూన్ 18 బజార్ హత్నూర్**

హైదరాబాదులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నూతన ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ని ఎమ్మెల్సీ దండే విట్టల్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, డి సీ సీ బి చైర్మన్ అడ్డి బోజారెడ్డి, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు విశ్వ ప్రసాద్ రావు, సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి తో కలిసి నూతన జిల్లా ఇంచార్జి మంత్రిని కలిసిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ఈ సందర్భంగా బోథ్ నియోజక వర్గం అభివృద్ధికి సహకారం అందించాలని ఆయన కోరారు



# భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి
## కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి**

**నిజామాబాద్ బ్యూరో**

జిల్లాలో చేపట్టే రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ వీసీ కాన్ఫరెన్స్ హాల్ లో రోడ్ల విస్తరణ, రైల్వే పనులు, నీటి పారుదల, జాతీయ రహదారులు, పరిశ్రమల స్థాపన తదితర వాటికి అవసరమైన భూసేకరణపై సంబంధిత అధికారులతో శాఖల వారీగా కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత పనుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, భూసేకరణపై పెండింగ్ లో ఉన్న అప్పీల్ లను వేగంగా పరిష్కరించాలని అన్నారు. వారం అనంతరం భూసేకరణపై మళ్ళీ సమీక్ష చేస్తామని, స్పష్టమైన ప్రగతి కనిపించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, మెప్మా పీ.డీ రాజేందర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు భాస్కర్, రైల్వే, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, ఇరిగేషన్, టీజీఐఐసి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# హనీమూన్ మర్డర్ కేసులో మరో బిగ్ ట్విస్ట్

## సంజయ్ వర్మ అనే వ్యక్తికి సోనమ్ 119 కాల్స్

**షిల్లాంగ్,జూన్18(సమయజ్యోతి):**

హనీమూన్ మర్డర్ కేసులో మరో బిట్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఈ కేసులో లేని కొత్త పేరు తెరపైకి వచ్చింది. ఇటీవల మేఘాలయలో జరిగిన రాజా రఘువంశీ హత్య దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. భార్య సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహా ప్లాన్ చేసి, హత్య కోసం కిరాయి హంతకులను నియమించుకున్నారు. మేఘాలయ హనీమూన్‌కి వెళ్లిన సమయంలో భార్య సోనమ్ దగ్గర ఉండీ తన భర్త రాజాను హత్య చేయించింది. ఈ కేసుకు సంబంధించి పోలీసు దర్యాప్తులో సోనమ్ కాల్ డేటాను విశ్లేషించగా మరో పేరు బయటకు వచ్చింది. సంజయ్ వర్మ అనే వ్యక్తికి సోనమ్ మార్చి 1 నుంచి మార్చి 25 వరకు 119 కాల్స్ చేసినట్లు గుర్తించారు. ప్రస్తుతం, అతడి మొబైల్ నెంబర్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. ఇద్దరి మధ్య జరిగిన ఈ ఫోన్ సంభాషణలపై ఇప్పుడు పోలీసులు దృష్టిసారించారు. మే 23న మేఘాలయాలోని తూర్పు ఖాసీ హిల్స్‌లో రాజాను హత్య చేశారు. వీ సావ్‌డాంగ్ జలపాతం సమీపంలోని లోయలో అతడి మృతదేహాన్ని జూన్ 2న గుర్తించారు. ఆ తర్వాత, జూన్ 08 సోనమ్ ఉత్తర్ ప్రదేశ్ ఘాజీపూర్ పోలీసుల ముందు లొంగిపోయింది. ఈ కేసులో రాజాను ముందుగా దావో అనే పిలిచే కత్తితో హత్య చేశారు. హత్య జరుగుతున్న సమయంలో సోనమ్ అక్కడే ఉందని, ఆమె భర్తపై దాడి తర్వాత అతను కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయిందని, ఆ తర్వాత మరికొన్ని కత్తి దాడుల తర్వాత రాజా రఘువంశీ చనిపోయినట్లు హంతకుల్లో ఒకరైె విశాల్ సింగ్ పోలీసులకు చెప్పాడు.

# సిట్ కార్యాలయానికి ట్యాపింగ్ బాధితులు

## ఫిర్యాదులు చేస్తున్న పలువురు వ్యక్తులు

**హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి):**

తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో దర్యాప్తును సిట్ వేగవంతం చేసింది. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన బాధితులకు సిట్ అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో వాంగ్మూలం ఇచ్చేందుకు జూబ్లీహిల్స్ సిట్ కార్యాలయానికి ఫోన్ ట్యాపింగ్ బాధితులు క్యూ కడుతున్నారు. బాధితుల నుంచి వాంగ్మూలాన్ని సేకరిస్తోంది సిట్. ఇందులో భాగంగా ఈరోజు (బుధవారం) టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చేందుకు సిట్ కార్యాలయానికి వచ్చారు. సిట్ అధికారుల నుంచి తన ఫోన్ ట్యాప్ అయినట్టు సమాచారం వచ్చిందని జైపాల్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. జైపాల్ నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనుంది సిట్. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక్కరోజే 600 మంది ఫోన్లు ఒకేసారి ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్లు ట్యాప్ అయిన వారిని బాధితులుగా గుర్తించి వారికి సమాచారం ఇస్తున్నారు సిట్ అధికారులు. ఈకేసులో సాక్షులుగా వారిచ్చే వాంగ్మూలాన్ని రికార్డు చేస్తున్నారు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా పెద్ద మొత్తంలో బాధితుల నుంచి వాంగ్మూలాన్ని సిట్ రికార్డు చేసినట్లు తెలుస్తోంది. ఈరోజు కూడా మరికొంత మంది బాధితులు సిట్ కార్యాలయానికి వచ్చి వాంగ్మూలాన్ని ఇస్తున్నారు.

# 52 మంది బాధితులకు డబ్బులు అందజేత

**మల్కాజిగిరి జూన్18(సమయజ్యోతి):**

నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ క్రైమ్ కేసులలో డబ్బులు పోగొట్టుకున్న 52 మంది బాధితులకు కోర్టు ద్వారా ప్రాసెస్ చేసి %=ం%.8,33,615/- ( ఎనిమిది లక్షల ముప్పై మూడు వేల ఆరు వందల పదిహేను రూపాయలు) సంబందిత బాదితులకు మనీ రిఫండ్ చేయడం జరిగినది. అట్టి ఆర్డర్ కాపీలను బాధితులకు బుధవారం పోలీస్ స్టేషన్లో అందజేయడం జరిగినది.

బాధితులకు మనీ రిఫండ్ చేయడం లో బాగస్వామయం అయిన హెడ్ కానిస్టేబుల్ శ్రీ కాంతయ్య , కానిస్టేబుల్ రఘు ,నాగలత మరియు కుమారి, స్వప్నా ని ప్రత్యే కంగా అభినందిచడం జరిగింది. గమనిక: సైబర్ క్రైమ్ కు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఒకవేళ సైబర్ క్రైమ్ కి బాధితుగా మారినట్లయితే వెంటనే (గోల్డెన్ అవర్)1930 లేదా సైబర్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేసినట్లయితే రిఫండ్ కి ఆస్కారం ఉంటుందని తెలియజేస్తున్నాం.






# కరీంనగర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర నాయకులు

**కరీంనగర్ జూన్18(సమయజ్యోతి):**

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీని తెలంగాణలో మరింత బలోపేతం చేయడమే ప్రధాన ధ్యేయంగా నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా పని చేయాలని మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆజ్మీర రాజ్ నాయక్, శ్రీమతి గడ్డి పద్మావతి గార్లు అన్నారు. వారు పార్లమెంటు కార్యాలయాన్ని సందర్శించి పార్లమెంటు కన్వీనర్, పరిశీలకులతో పార్టీ సంస్థ గత నిర్మాణం గురించి వార్డు, గ్రామ, మండల, పట్టణ కమిటీలను అడిగి తెలుసుకున్నారు. పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీనియోజకవర్గాల్లోని 47 మండలాలకు గాను 37 మండలాల్లో మండల కమిటీలు వేయడం జరిగిందని మిగతా మండలాల్లో కూడా కమిటీలను త్వరగా పూర్తి చేసి రాష్ట్రపార్టీ కార్యాలయానికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్ హాక్ కమిటీ కన్వీనర్ వంచ శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు దామెర సత్యం, కళ్యాడపు ఆగయ్య, తీగల శేఖర్ గౌడ్, మచ్చ ఆంజనేయులు, మాజీ జెడ్పిటిసి ఆజ్మీర ప్రేమలత తదితర ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ వివేక్

**తెలంగాణ జూన్18(సమయజ్యోతి):**



తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజీ శాఖ మంత్రిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి బుధవారం కుటుంబ సమేతంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తనకు కేటాయించిన మినిస్టర్ ఛాంబర్ నంబర్ 20, 21, 22 లలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, ఎమ్మెల్యే నాగరాజు, చెన్నూరు నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజుతోనే అధికారిక పనులకు శ్రీకారం చుట్టిన డాక్టర్ వివేక్ వెంకటస్వామి, రాష్ట్రంలోని కార్మిక వర్గ అభ్యున్నతితో పాటు, ఉపాధి అవకాశాల సృష్టిని లక్ష్యంగా తీసుకుని, పారదర్శకమైన పాలన అందిస్తానని తెలియజేశారు.

# రైతుభరోసాపై మాట్లాడే అర్హత లేదు

## -బిఆర్ఎస్ నాయకులకు మంత్రి తుమ్మల కౌంటర్-వరుసగా నాలుగోరోజు రైతు ఖాతాల్లో నగదు జమ

**హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి)**

రైతుభరోసా విషయంలో భారాస నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో భారాస ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయింది. ప్రతిసారి ఆలస్యంగా రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. కానీ తాము ప్రకటించిన మేరకు నిధులు విడుదల చేస్తున్నామని అన్నారు. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు అందజేస్తున్నాం. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్ సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా గత ప్రభుత్వం వదిలేస్తే.. మేం అధికారంలోకి రాగానే ఆ నిధులు కూడా చెల్లించాం. రైతుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.77,000 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తుమ్మల అన్నారు. రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ కొనసాగుతోంది. మూడో రోజు బుధవారం 4 ఎకరాల విస్తీర్ణం వరకు రైతుభరోసా నిధులు జమ కోసం ప్రభుత్వం మరో రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. మరో 21.89 లక్షల ఎకరాలకు సంబంధించి 6.33 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.5215.26 కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేసి 58.04 లక్షల మంది రైతులకు సాయం అందించినట్లైంది. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో రోజు రైతుభరోసా నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు వానాకాలం రైతుభరోసా నిధులు జమ చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా 9 రోజుల్లో రైతుభరోసా సహాయం పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికైనా భారాస నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి. లేదంటే రైతాంగం ఎప్పటికీ క్షమించదు'అని మంత్రి తుమ్మల అన్నారు.

# గోశాలల నిర్మాణం ఆలోచన అద్భుతం

## గో సంరక్షణకు కమిటీ వేసి...నన్ను మెంబర్ చేయండి

## సిఎం రేవంత్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ సూచన


**హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి)**

రాష్ట్ర ప్రభుత్వం కొత్త గోశాలలు నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ధన్యవాదాలు తెలిపారు. వేల సంఖ్యలో ఆవులు, దూడలు, ఎద్దులను కబేళాల్లో అక్రమంగా చంపుతున్నారని ఆరోపించారు. దీన్ని నివారించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని కోరారు. 'మోడల్ గోశాలలు నిర్మించే నిర్ణయం చాలా మంచిదని అన్నారు. గో రక్షణ గురించి ఒక స్పెషల్ పోలీస్ ఫోర్స్ ఏర్పాటు చేయండి. అందులో నన్ను కూడా సభ్యుడిగా నియమించండిని రాజాసింగ్ సిఎంకు సూచించారు. దేశంలోని ముఖ్యమంత్రులందరిలో గోవులకు సేవ చేసే నిజమైన ముఖ్యమంత్రి ఎవరు అని అడిగితే గుర్తుకు వచ్చే రెండో పేరు మీదేని అన్నారు. . మొదటి పేరు యోగి ఆదిత్యనాథ్, రెండో పేరు రేవంత్ రెడ్డి. ఇలాంటి పనులు చేస్తే మీకు దేశంలో మంచి గుర్తింపు వస్తుంది. తెలంగాణలో గోవధను నిషేధించాలి' అని రాజాసింగ్ కోరారు. గో రక్షణ గురించి ఒక స్పెషల్ పోలీస్ ఫోర్స్ తయారు చేయాలని, అందులో ఒక మెంబర్‌గా తనను కూడా ఉంచాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ పనులన్నీ ముఖ్యమంత్రి చేస్తే భారత దేశంలో ఒక మంచి గుర్తింపు దొరుకుతుందని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తెలంగాణలో గోవుల సంరక్షణకు ఎంత ఖర్చైనా ప్రభుత్వం వెనుకాడబోదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోవుల సంరక్షణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. గోవుల సంరక్షణ కోసం వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ కమిటీని కోరారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ కమిటీలో ఉన్నారు. వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశుసంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలోని విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలన్నారు. వేములవాడలో కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చాలని సీఎం సూచించారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త విషయాలు

## -4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్ -విచారణ జరిగే కొద్దీ వెలుగు చూస్తున్న అక్రమాలు

**హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి)**



ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొన్ని పార్టీలు లేదా వ్యక్తులు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారన్న నెపంతో, పలువురు కీలక రాజకీయ నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు వెల్లడవుతోంది. తాజాగా ఈ కేసులో 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుపై ఆరోపణలు వచ్చాయి. 2023 నవంబర్ 15 నుండి 30వ తేదీ మధ్యలోనే కనీసం 618 మంది నేతల ఫోన్లను ట్యాప్ చేశారట. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ నాయకులు కూడా ఉన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి, కోటింరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి వంటి నాయకుల ఫోన్లను కూడా ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం ట్యాప్ చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ సహా అనేక పార్టీల కీలక నేతలు, అనుచరుల ఫోన్లు కూడా ట్యాపింగ్ లక్ష్యంగా మారాయి. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేగంగా దర్యాప్తు కొనసాగిస్తోంది. నిన్న ఒక్కరోజే తొమ్మిది మంది సాక్షుల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. అందులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఆమె భర్త తిరుపతయ్య, గాంధీ భవన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు ఉన్నారు. ఇవన్నీ మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చిన ఆధారాలతో వెలుగులోకి వచ్చాయి. ఈ రోజు పీసీసీ అధికార ప్రతినిధి జయపాల్ రెడ్డి సిట్ ముందు హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చారు. అదే విధంగా ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును కూడా విచారించారు.

# జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం -ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

## సిసి రోడ్లు యూజీడి పనులకు శంకుస్థాపన

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే పాత్రికేయుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారుతెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం జిఎంఆర్ మోడల్ జర్నలిస్ట్ కాలనీ లో 50 లక్షల రూపాయల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్లు యూజీడి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం రెండు సంవత్సరాల క్రితం వందమంది జర్నలిస్టులకు ఇంటి స్థలాలు అందజేయడం జరిగిందని తెలిపారు ఆయా కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు జర్నలిస్టులకు ఇళ్లస్థలాలతో పాటు 60 లక్షల రూపాయల సొంత నిధులతో ఆరోగ్య భీమాను సైతం అందించడం జరిగిందని గుర్తు చేశారు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటి కప్పుడు తమ దృష్టికి తీసుకుని వచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి డిఈ సత్యనారాయణ ఏఈ మౌనిక సీనియర్ నాయకులు అంతిరెడ్డి బండి శంకర్ జంగారెడ్డి రామచందర్ జర్నలిస్టులు పాల్గొన్నారు



# మాలేబోరిగాం లో వైద్య శిభిరం

## -డా. సర్ఫరాజ్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్**

ఆదిలాబాద్ రూరల్ మండలం లోని వాఘపూర్ సబ్ సెంటర్ పరిధిలోని మాలేబోరిగాం గ్రామములో డా సర్ఫరాజ్ గారి ఆదేశాలతో డా భాగ్య లక్ష్మి జన్ మన్ గారు మెడికల్ క్యాంపు నిర్వహించి అక్కడున్నా 28 మంది గ్రామ ప్రజలకు మందుగోళీలు ఇవ్వడంజరిగింది 4గురి మందికి రక్త పుతాలు తీసినారు, సిబ్బంది బిపి, షుగర్ సికిల్ సెల్ టెస్ట్ లు నిర్వహించడం జరిగింది.

కార్యక్రమం లో ఆరోగ్య పర్యవేక్షకులు బి. సుభాష్, ఆరోగ్యసహాయకులు గేడం సంగీత, నల్ల ఈశ్వర్ రెడ్డి, ల్యాబ్ టెక్నిషన్ పల్లవి, ఫార్మాసిస్ట్ అరుణ, స్టాఫ్ నర్స్ సింధు, ఆశా కార్యకర్తలు సుమన్, శాంతాబాయి, భాగ్య లక్ష్మి, కమల,గ్రామప్రజలు మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నట్టు హెల్త్ సూపర్ వైజర్ బొమ్మెత సుభాష్ తెలియజేసినారు.




# తల్లి మెడలోని బంగారు గొలుసును దొంగలించిన కొడుకు అరెస్ట్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లో మే 24వ తేదీన జరిగిన చైన్ స్నాచింగ్ కేసు నమోదు అవడం జరిగింది ఈ కేసును మందమర్రి సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో కేసును చకచక్యంగా చేదించి తల్లి మెడలోని బంగారు గొలుసును దొంగలించిన కొడుకును నిందితుడిని అదుపులో తీసుకోవడం జరిగింది దీనికి సంబంధించి మందమర్రి సర్కిల్ కార్యాలయంలో బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏసిపి రవికుమార్, సీఐ శశిధర్ రెడ్డి లు మాట్లాడుతూ రైల్వే స్టేషన్ రోడ్ లో మే 24వ తేదీన జరిగిన చైన్ స్నాచింగ్ కేసును చేదించామని ఈ కేసులో నిందితుడు తన కన్నతల్లి మెడలోని బంగారు గొలుసును దొంగిలించి గుర్తుతెలియని వ్యక్తులపై నెపం మోపారని తెలిపారు. పోలీసులకు కొడుకు పై అనుమానం రావడంతో చాకచక్యంగా ఆధారులను సేకరించి నిందితుడైన కొడుకుని అదుపులో తీసుకోవడం జరిగిందని అన్నారు. మందమర్రి రైల్వే స్టేషన్ రోడ్లో నివాసముంటున్న విజయపురి పుల్లమ్మ 76 అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ మంచంలో ఉన్న సమయంలో రాత్రి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడని ఆమె మనవడు శివ పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మందమర్రి పోలీసులు సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగిందని అన్నారు. వృద్ధురాలి కొడుకైన విజయపురి శంకరయ్య 65 ప్రవర్తనపై అనుమానం రావడంతో అతన్ని విచారించగా విచారణలో శంకరయ్య తన నేరాన్ని అంగీకరించాడని ఆర్థిక ఇబ్బందుల కారణంగా తానే తన తల్లి మెడలోని బంగారు గొలుసును దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి నుండి చోరీ అయినా రెండు తులాల బంగారు గొలుసును స్వాధీన పరుచుకొని నిందితుడిని రిమాండ్ కు పంపించామని అన్నారు. ఈ కేసును ఛేదించడంలో సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, క్రైమ్ టీం కానిస్టేబుళ్లు మహేష్, రాకేష్లను రామగుండం పోలీస్ కమిషనర్, మంచిర్యాల డిసిపి లు అభినందించారని అన్నారు.



# ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రిని కలిసిన ప్రభుత్వ విప్, కేకే

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రాష్ట్ర రాజధానిలో బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డితో కలిసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది -టిఎస్ యూటీఎఫ్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్**

ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో మళ్లీ విశ్వాసం పెరుగుతుండటం ఆశాజనకమని తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టిఎస్ యూటీఎఫ్) పేర్కొంది. ఆదిలాబాద్‌లో జరిగిన జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో మాట్లాడిన టిఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ. వెంకట్, ప్రభుత్వ విద్యావ్యవస్థ పునరుజ్జీవనానికి ఇది ఓ మంచి సంకేతమని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో టిఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల నమోదు (ఎన్రోల్మెంట్) ప్రచార జాతాలు ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని పెంపొందించాయనీ, ఇది చారిత్రాత్మక కృషిగా నిలుస్తుందనీ ఆయన తెలిపారు.ఈ జాతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొని టిఎస్ యూటీఎఫ్ సామాజిక బాధ్యతను ప్రశంసించారని ఆయన తెలిపారు. ప్రజలు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు తమ మద్దతు తెలపడం గర్వకారణమని వెంకట్ అన్నారు.

"ఈ ప్రచార ఫలితాలు ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో స్పష్టంగా కనిపించాయి" అని ఆయన పేర్కొన్నారు. అనేక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుండి తీసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారనీ, ఇది ప్రజల్లో అవగాహన పెరిగిన సంకేతమనీ ఆయన తెలిపారు."ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణకు, పాఠశాలల అభివృద్ధికి మా సంఘం ఎప్పటికీ కట్టుబడి ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో టిఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కె. కిష్టన్న, ప్రధాన కార్యదర్శి వి. అశోక్, ఉపాధ్యక్షుడు టి. సూర్య కుమార్, కోశాధికారి కె. శ్రీనివాస్, కార్యదర్శులు ఎ. స్వామి, ఎ. ఇస్తారి, గౌస్ మొహియుద్దీన్, కె. గణేష్, వాయ్. అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి నిరుద్యోగ మహాగర్జన వాల్ పోస్టర్ విడుదల

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా**

హైదరాబాద్ లోని దిల్ సుఖ్ నగర్ చౌరస్తాలో విద్యార్థి నిరుద్యోగ మహా గర్జన వాల్ పోస్టర్ను అశోక్ సార్ ట్రైనర్ తో కలిసి తిమ్మప్ప, వెంకటేష్ బుధువారం విడుదల చేశారు. అనంతరం నిరుద్యోగ యువకుడు తిమ్మప్ప మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్ పేరుతో ఓట్లు వేయించుకొని నిరుద్యోగులు మోసపోయామని ఈ సందర్భంలో ఈనెల 20వ తేదీన చలో ఇందిరాపార్క్ వద్ద విద్యార్థి నిరుద్యోగ మహా గర్జన ధర్నాకు నిరుద్యోగ యువతీ యువకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**-ఇండ్ల కేటాయింపుల్లో అవినీతి అక్రమలను అరికట్టాలి.-కౌలు రైతులకు వెంటనే రైతు భరోసా వర్తింపజేయాలి.**
**-సన్న వడ్లకు బోనస్ వెంటనే చెల్లించాలి.- బడే నాగజ్యోతి- బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ జడ్పీ చైర్పర్సన్**

జిల్లాలలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని బీరెల్లి గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని పార్టీ శ్రేణులతో గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.బడే నాగజ్యోతి మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని కాంగ్రెస్ ప్రభుత్వం పై నాగజ్యోతి మండిపడ్డారు. జిల్లాలలో అర్హులకు కాకుండా అనర్హులకు కట్టబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు, అసలైన లబ్ధిదారులను జాబితాలో చేర్చకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు డబ్బులు చెల్లించిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని నాగజ్యోతి తెలిపారు.అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మభ్యపెడుతున్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్లను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలల అయినా కూడా ఏ ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయలేదని, కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. సన్న ధాన్యానికి ఇచ్చే 500 బోనస్ వెంటనే చెల్లించాలని రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలని నాగజ్యోతి ప్రభుత్వాన్ని కోరారు మంత్రి సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట అధికారంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు,మాట ఇచ్చి తప్పడం కాంగ్రెస్ కి వెన్నతో పెట్టిన విద్యనే అని అన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాగజ్యోతి ప్రభుత్వాన్ని



హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోమాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, మాజీ జెడ్పిటిసి రామ సహాయం శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షులు దుండగుల మల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి పోగు నాగేష్, మాజీ మండల అధ్యక్షుడు దిడ్డి మోహన్ రావు, మహిళా మండల అధ్యక్షురాలు సామ నాగక్క,బీరెల్లి మాజీ సర్పంచ్ జాజా చంద్రం, గ్రామ కమిటీ అధ్యక్షులు దాయ రోషన్న, మాజీ మండల ఉపాధ్యక్షులు పెనక విశ్వనాథం, జిల్లా నాయకురాలు ఇరుప విజయ, సమన్వయ కమిటీ సభ్యులు జాడి బాబురావు,సీనియర్ నాయకులు మోరే నరసింగరావు,
భాషని సురేష్, బెజ్జూరి శ్రీకాంత్,బాగే రాములు, లక్ష్మణ్,బీరెల్లి సోషల్ మీడియా ఇంచార్జి గడదాసు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## నిమ్ లో శిక్షణా తరగతుల ప్రారంభం

**కమాన్ పూర్ సమయజ్యోతి , జూన్ 18:**

8 ఇంక్లైన్ కాలనీ, సింగరేణి సంస్థ ఆర్జీ 2 ఏరియాలోని నర్గుండ్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ - 2 వ బ్యాచ్ జూన్ 18 నుండి జూన్ 21, 2025 వరకు 4 రోజుల పాటు అధికారులకు ఇన్-హౌస్ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ బి. వెంకటయ్య గారు మరియు జనరల్ మేనేజర్ (హెచ్ఆర్డీ) కార్పొరేట్ శ్రీ వెంకటరామిరెడ్డి గారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎక్స్టర్నల్ ఫ్యాకల్టీ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్షిప్, టీం వర్క్, పర్సనాలిటీ డెవలప్మెంట్, గోల్స్ అచీవ్మెంట్ వంటి అంశాలపై విస్తృతంగా శిక్షణ ఇవ్వబడుతుంది."ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు మన అధికారులకు తమ వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకోవడానికి, సమర్థవంతమైన నాయకత్వ నైపుణ్యాలను అలవర్చుకోవడానికి ఒక గొప్ప వేదికగా నిలుస్తున్నాయి. ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీ మరియు కార్మిక సంబంధాల వాతావరణంలో మానవ వనరుల ప్రాభవాన్ని పెంచే కోణంలో ఈ శిక్షణ ఫలదాయకంగా నిలవాలని ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ బి. వెంకటయ్య గారు అన్నారు. "వర్క్ ప్లేస్‌లో ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, టీం వర్క్ మరియు పర్సనాలిటీ డెవలప్మెంట్ అనేవి ప్రతి అధికారిక పరిపక్వతకు మూలసూత్రాలు. ఈ నాలుగు రోజుల శిక్షణ ద్వారా అధికారులలో ఆత్మవిశ్వాసం పెరిగి, వారంతా తమ విధుల్లో మరింత ఉత్తమంగా రాణించాలని జనరల్ మేనేజర్ (హెచ్ఆర్డీ) కార్పొరేట్ శ్రీ వెంకటరామిరెడ్డి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం నిమ్ ఎస్డి.జవీద్ అక్మల్ హుస్సైనీ, ఎక్స్టర్నల్ ఫ్యాకల్టీ జగదీష్ మరియు శిక్షణ తరగతుల వచ్చిన అధికారులు పాల్గొన్నారు .



## పులి ఆంజనేయులు గౌడ్ కుటుంబాన్ని పరామర్శ:

**రామడుగు:సమయజ్యోతి:**

రామడుగు మండలం చిప్పకుర్తి గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ వారి తండ్రి పులి పరుశరాములు గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని పొన్నం ప్రభాకర్ గౌడ్ సోదరుడు గద్దర్ ఫిలిం అవార్డు గ్రహీత కరీంనగర్ ఫిలిం అసోసియేషన్ అధ్యక్షులు పొన్నం రవిచంద్రన్ అన్న బుధవారం పులి ఆంజనేయులు గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతోపాటు కరీంనగర్ అయ్యప్ప టెంపుల్ చైర్మన్ యాగండ్ల రవీందర్ గౌడ్ రాష్ట్ర గౌడ సంఘం వైస్ ప్రెసిడెంట్ పడాల స్వామి గౌడ్ కరీంనగర్ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## జూన్ 20న బట్టుపల్లి లో పీ.ఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పై అవగాహన సదస్సు

**-పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**మంథని ప్రతినిధి, సమయజ్యోతి, జూన్ 18:**




జూన్ 20న మంథని మండలం బట్టుపల్లి గ్రామంలో పీ.ఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.గిరిజనుల వికాసానికి సామాజిక ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పీ.ఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకం క్రింద పెద్దపెల్లి జిల్లాలో మంథని మండలం బట్టుపల్లి ను ఎంపిక చేశామని అన్నారు.గిరిజన మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ద్వారా ప్రకటించబడిన పీ.ఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకం పై అవగాహన కల్పించుటకు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక క్యాంపు లలో ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కులసర్టిఫికెట్, జన ధన్ బ్యాంక్ అకౌంట్ మొదలగు అర్హులకు అందించడం జరుగుతుందని అన్నారు.
జూన్ 20న జరిగే పీ.ఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ అవగాహన సదస్సును సంబంధిత గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు..

## వృద్ధురాలి మెడలో నుండి రెండున్నర తులాల బంగారు తాడు లాక్కెళ్ళిన దొంగలు

**-భయాందోళనలో గద్దలపల్లి గ్రామస్తులు**

**మంథని ప్రతినిధి, సమయజ్యోతి, జూన్ 18**



మంథని మండలంలోని గద్దలపల్లి (ధర్మారం) గ్రామంలో కందుకూరి లక్ష్మి బాయి (60) తన ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని దొంగలు ఆమె మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు తాడును లాక్కొని పారిపోయారు. లక్ష్మీబాయికి ఇద్దరు కూతుళ్లు ఒక కొడుకు ఉండగా రెండు సంవత్సరాల క్రితం కొడుకు మరణించాడు. ఆమె చిన్న కూతురుతో ఇంట్లో నివసిస్తుంది ఇటీవల చిన్న కూతురు బంధువుల ఇంటికి వెళ్ళగా ఇంట్లో వృద్ధురాలు ఒకమె ఉండడంతో ఈ ఘటన జరిగింది. ఈ సంఘటనతో గద్దలపల్లి గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. చోరీ జరిగిన స్థలాన్ని మంథని పోలీసులు సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

**విద్య ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**జిల్లా విద్యాశాఖ**

**అధికారి డాక్టర్ ఏ.రవీందర్ రెడ్డి**

**పెద్ద వంగర,మహబూబాబాద్ , ప్రతినిధి (జూన్ 18)**

**సమయజ్యోతి న్యూస్ :**

డిఎన్టిపిఎస్ రాజ్ మాన్సింగ్ తండా పెద్దవంగర మండల్, ఎంపీపీ ఎస్ హజారియా తండా మహబూబాబాద్ మండల్ పాఠశాలను 12 సంవత్సరాల తర్వాత జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి ప్రోత్సాహంతో పునః ప్రారంభం చేయబడింది జరిగింది. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పిఎం శ్రీ అవతా పురం పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు ఇప్పటినుండే పబ్లిక్ పరీక్షలు ఏ విధంగా సన్నద్ధం కావాలో ఏ రకమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలి లిటిల్ టీచర్ లిటిల్ లీడర్ కాన్సెప్ట్ ఏ విధంగా ఇంప్లిమెంట్ చేయాలో వివరిస్తూ, పాఠశాలకు తప్పని సరిగా రోజు హాజరైతే ఏరకమైన అనుకూల ఫలితాలు విద్యార్థులకు అభ్యసనలు లభిస్తాయని, ఈ విద్యా సంవత్సరం ముగిసే లోపు విద్యార్థులు రాసే పరీక్షల ద్వారా వారి యొక్క ప్రజెంటేషన్ స్కిల్స్ , హ్యాండ్ రైటింగ్ అన్నింటిలో మార్పులు వచ్చి పరీక్షల పట్ల భయం పోయి పబ్లిక్ ఎగ్జామినేషన్స్ బాగా రాస్తారని ప్రోత్స హించడం జరిగింది.జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి వెంట జిల్లా పౌర సంబంధం శాఖ అధికారి రాజేంద్రప్రసాద్, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందంతో మండల విద్యాధికారి బుద్ధారం శ్రీనివాస్, పెద్దవంగర మండలం కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మరి స్పెషలాఫీసర్ కళాధర్, అదే విధంగా జిల్లా అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, మహబూబాబాద్ మండలం ఎంయుఎస్ వెంకటేశ్వర్లు, ఏసీజీ మరియు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మందుల శ్రీరాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పంచాయతీ సెక్రటరీలు అంగన్వాడి వారు ప్రజా ప్రతినిధులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం 33 వ వార్షికోత్సవం...

**జమ్మికుంట (సమయజ్యోతి) జూన్ 18..**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి లో శ్రీ భక్తంజనేయ స్వామి దేవాలయంలో 33వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం రోజున బొద్దుల రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వోడితల ప్రణవ్ బాబు, హాజరై ప్రతేక పూజాలు చేశారు అనంతరం బొద్దుల రవీందర్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు,ను ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రణవ్,తో పాటు దేశిని కోటి, సాయిని రవి, మాజీ కౌన్సిలర్ జుగూరు సదానందం, సాయి, తదితరులు పాల్గొన్నారు...





## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ ఎంపీపీ

**కమాన్ పూర్ సమయజ్యోతి జూన్ 18.**

కమాన్ పూర్ మాజీ ఎంపీపీ కోలేటి మారుతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో కలిసి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. మంథని అభివృద్ధిపై సీఎంకు మారుతి వివరించారు. నియోజకవర్గానికి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.



## గ్రామాలలో ఇంటి పన్ను ఎప్పటికప్పుడు వసూలు చేయాలి

**-పెద్దపల్లి జిల్లా పంచాయతి అధికారి వీర బుచ్చయ్య**

**మంథని జూన్18(సమయజ్యోతి):**

2025-26 సంవత్సరపు ఇంటి పన్ను ఎప్పటికప్పుడు వసూలు చేసి అన్ని గ్రామపంచాయతీలలో వంద శాతం పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా పంచాయతి అధికారి వీర బుచ్చయ్య అధికారులను ఆదేశించారు.బుధవారం మంథని మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయములో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతి అధికారి వీర బుచ్చయ్య హాజరయ్యారు. డైలీ సానిటేషన్- సీషనల్ వ్యాదులు వర్ష కాలంలో ప్రాబలకుండా తగు చర్యలు సుకొనుట గురించి చర్చించారు.ఇంటి పన్ను వసూళ్ళు, ట్రేడ్ లైసెన్స్ రినివాల్ , శేగ్రిగేషన్ షెడ్ లో కంపోస్ట్ ప్రిపరేషన్, ఎల్ఆర్ఎస్ ఫిజు చెల్లింపులు మరియు ఇతర అంశముల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు గ్రామ పంచాయతీలలోని చెత్తను సేగ్రిగేషన్ షెడ్డు కు తరలించి, కంపోస్ట్ ఎరువును తయారు చేయవలసినదిగా ఆదేశించారు.ఇట్టి విషయములలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధితులపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ సిబ్బంది వేతనాలు సకాలంలో చెల్లింపులు జరగాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శశికళ. డిఎల్పిఓ సతీష్ కుమార్, ఎంపీఓ టి. శేషయ్యసూరి, మంథని మండలం లోని పంచాయతీ కార్యదర్శులు, ఈ పంచాయత్ కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



# హిందీ బోధన తప్పనిసరి కాదు

## మరో భాషను ఎంచుకునే అవకాశం ఉంది

## హిందీపై వెనక్కి తగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం

**ముంబై,జూన్ 18(సమయజ్యోతి):**

ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదివే పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. వ్యతిరేకత రావడంతోనే వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అయితే తప్పనిసరి అనే పదాన్ని నోటిఫికేషన్ నుంచి తొలగించింది. ప్రభుత్వ నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బుధవారం మహారాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. అందులో 'తప్పనిసరి' అనే పదాన్ని తొలగించింది. హిందీకి బదులు మరో భాషను ఎంచుకునే అవకాశం విద్యార్థులకు కల్పించింది. అయితే, ఆ భాష నేర్చుకోవాల నుకునే తరగతిలో కనీసం 20 మంది విద్యార్థులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. అప్పుడే ఆ సబ్జెక్టు పాఠశాలలో అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఆ భాషకు సంబంధించిన ఉపాధ్యాయుడి నియామకం కుదరకపోతే ఆన్‌లైన్ ద్వారా తరగతులు జరుగుతాయని వెల్లడించింది. జాతీయ విద్యా విధానంలో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. ఈ విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే హిందీని తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనిపై 'మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన' అధ్యక్షుడు రాజ్ థాక్రేతో పాటు ఉద్ధవ్ థాక్రే నుంచి కూడా తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో దీనిపై పోరాడేందుకు థాక్రేలు ఏకం కానున్నారనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

# మావోలకు మరో ఎదురుదెబ్బ

## రంపచోడవరం ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృతి

## మృతుల్లో అరుణ,గాజర్ల రవి, అంజు ఉన్నట్లు గుర్తింపు

**రంపచోడవరం,జూన్ 18(సమయజ్యోతి):**

మావోయిస్టులకు మరో భారీ ఎదరుదెబ్బ తగిలింది. మరో అగ్రనేత హతమయ్యాడు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. దేవీపట్నం మండలం కొండమొదలు అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు మృతిచెందారు. వీరిలో ఇటీవల మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత చలపతిరావు భార్య, స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు అరుణతో పాటు కేంద్ర కమిటీ సభ్యుడుయ గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ ఏసీఎం అంజు ఉన్నట్లు గుర్తించారు. ఘటనాస్థలంలో మూడు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. 2018లో డుంబ్రిగుడ సమీపంలో జరిగిన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులో అరుణ నిందితురాలిగా ఉన్నారు. ఆమె స్వస్థలం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. ఉదయ్‌పై రూ.25లక్షలు, అరుణపై రూ.20లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకురానున్నారు. కాల్పులు జరిగిన ప్రాంతానికి మారేడుమిల్లి సీఐ, దేవీపట్నం ఎస్సై, పోలీసు సిబ్బంది బయల్దేరారు.

# బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణ

## హైదరాబాద్ అనుకూలమనన్న సిఎం రేవంత్

**హైదరాబాద్,జూన్ 18(సమయజ్యోతి):**



హైదరాబాద్ లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్, బెంగుళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు అనుకూలమైనవని రేవంత్ వివరించారు. ఇప్పటికే హైదరాబాద్ లో డిఫెన్స్ కు సంబంధించి వివిధ సంస్థలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ / సీఈవో డా, జైతీర్థ్ ఆర్. జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీ.ఏ. శ్రీనివాస మూర్తి, తదితరులు సీఎంతో భేటీ అయ్యారు. దేశంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమని చెప్పారు.బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు తెలంగాణ, హైదరాబాద్‌ను ఎంచుకోవాలని, ప్రభుత్వం వైపు నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సీఎం వాదనలపై బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం సానుకూలంగా స్పందించింది. ఈ భేటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

# ఫాస్టాగ్ పాస్‌ల ఆలోచన భేష్

## గడ్కరీ ప్రకటనను స్వాగతించిన పవన్ కళ్యాణ్

**అమరావతి,జూన్ 18(సమయజ్యోతి):**



ఫాస్టాగ్ పాస్‌ల ఆలోచనను ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ స్వాగతించారు. ఇదో మంచి ముందడుగని అన్నారు. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహన దారులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో దీన్నో గేమ్ ఛేంజర్‌గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ నిర్ణయంతో ఫాస్టాగ్ వార్షిక పాస్ తీసుకురావాలన్న ప్రయాణికుల దీర్ఘకాలిక డిమాండ్‌కు పరిష్కారం లభించినట్లవుతుందని పేర్కొన్నారు. టోల్ చెల్లింపులను సరళీకృతం చేస్తూ.. ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను అమలులోకి తీసుకొస్తున్నందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రూ.3వేల వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థిక ఉపశమనం కలగడం మాత్రమే కాదు.. దేశ వ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, వివాద రహిత హైవే ప్రయాణం సాకారమవుతుందన్నారు. దీని ద్వారా టోల్ ఎ÷-లాజాల సమీపంలో నివసిస్తూ రెగ్యులర్‌గా ప్రయాణించే వారికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. వారికి సమయంతో పాటు భారం కూడా తగ్గుతుంద న్నారు. ఈ నిర్ణయం నితిన్ గడ్కరీకి మోదీ సారథ్యంలోని ప్రజా పాలన పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.3 వేలు చెల్లించి ఈ పాస్ తీసుకోవాల్సి ఉంటుందని ఆయన 'ఎక్స్'లో చేసిన పోస్టును పవన్ రీట్వీట్ చేస్తూ పైవిధంగా స్పందించారు. అయితే కార్లు, జీపులు, వ్యాన్లు వంటి నాన్- కమర్షియల్ వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. పలు నిబంధనలు ఉండే అవకాశముంది.

# డిఎన్ఎ పరీక్షలతో మృతుల గుర్తింపు

## గుర్తించిన వారి మృతదేహాల అప్పగింత

**అహ్మదాబాద్,జూన్ 18(సమయజ్యోతి):**


అహ్మదాబాద్‌లోప్రమాదానికి గురైన ఎయిరిండియా బోయింగ్ విమాన మృతుల గుర్తింపు ప్రక్రియ కొలిక్కి వచ్చింది. డిఎన్ఎ టెస్టుల ద్వారా గుర్తించిన వారి శరీరీ భాగాలను వారి కుటుంబాలకు అప్పగించారు. విపరీతమైన వేడిలో కాలిన శరీరాలను డెన్ఎ ద్వారా గుర్తించడం కష్టసాధ్యం గా మారినా చివరకు ప్రక్రియను ముగించారు. ప్రమాదం వాటిల్లిన ఐదు రోజుల తర్వాత 163 మృతదేహాల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. దీనికోసం డీఎన్‌యే పరీక్షలపై ఆధారపడిన విషయం తెలిసిందే. 124 భౌతికకాయాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. విమానంలో ఉన్న 242 మందిలో ఒక్కరు మినహా అందరూ, బయట మరో 29 మంది ఈ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఎయిరిండియా పైలట్ సుమిత్ సభర్వాల్‌కు మంగవారం ముంబయిలో అంత్యక్రియలు నిర్వహించారు. 35 ఏళ్లుగా పనిచేస్తూ ఎంతోమందిని ఆయన తీర్చిదిద్దారని సహచరులు చెమర్చిన కళ్లతో గుర్తు చేసుకున్నారు. మృతిచెందిన సిబ్బందిలో మరికొందరి అంత్యక్రియలు కూడా పూర్తయ్యాయి. ప్రమాదంపై విచారణ చేపట్టిన బృందం మూడు నెలల్లో నివేదిక సమర్పించనుందని పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి మురలీధర్ మొహోల్ తెలిపారు. ఎయిరిండియా వద్దనున్న 34 బోయింగ్-787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో 12 వాటికి తనిఖీలు పూర్తయ్యాయని, వాటిలో ఎలాంటి లోపాలు బయట పడలేదని పుణెలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 12న బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనంపై విమానం కుప్పకూలి, మంటలు చెలరేగడంతో.. అందులోని విద్యార్థులు భయాందోళనకు గురికావడంపై మరో వీడియోలో వెలుగులోకి వచ్చింది. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు విద్యార్థులు రెండు, మూడు అంతస్తుల్లోని బాల్కనీల నుంచి బెడ్‌షీట్లు, తాళ్ల సాయంతో కిందికి దూకడం అందులో కనిపించింది. భవనానికి ఒకవైపు భారీగా మంటలు చెలరేగగా.. మరోవైపు నుంచి వీరు కిందికి దూకుతున్నట్లు వీడియోలో ఉంది. ప్రమాద బాధితులకు అవసరమైన న్యాయసాయం అందించడానికి గుజరాత్ రాష్ట్ర న్యాయసేవల సంస్థ ముందుకు వచ్చింది. మానసిక చికిత్స అవసరమైనా తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపింది.

# ఉత్తరాంధ్ర ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి మృతి

## -రవిపై 25 లక్ష రివార్డు ప్రకటించిన ప్రభుత్వం-ఎన్‌కౌంటర్‌తో సొంతూరు వెలిశాలలో విషాదం

**వరంగల్,జూన్ 18(సమయజ్యోతి):**

ఉత్తరాంధ్రలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలిశాలకు చెందిన గాజర్ల రవి మృతి చెందాడు. ఈ ఘటనతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. గాజర్ల రవి మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధు మిత్రులు శోకసంద్రంలో మునిగారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. పెత్తందార్ల వ్యవస్థకు వ్యతిరేకంగా తాడిత, పీడిత, బలహీన వర్గాల కోసం పోరుబాట ఎంచుకున్న వారిలో వెలిశాలలోని గాజర్ల కుటుంబం ఒకటి. కుటుంబంలోని అందరు కూడా అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమం వైపు అడుగులు వేశారు. గాజర్ల కుటుంబంలోని నలుగురు సోదరుల్లో ముగ్గురు అజ్ఞాతంలోకి వెళ్లారు. పెద్దవాడైన సమ్మయ్య సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ చేసి హన్మకొండలో స్థిరపడ్డారు. ఆయనపై కూడా మావోయిస్ట్ సానుభూతిపరుడిగా ముద్రవేయడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మిగతా ముగ్గురు అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్ళారు. వీరిలో గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్.. 35 ఏళ్లకు పైగా మావోయిస్ట్ పార్టీలో పనిచేసి బుధవారం జరిగిన ఎన్ కౌంటర్ లో మృతి చెందారు. మరో సోదరుడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు కూడా అజ్ఞాతంలోనే ఉండి అనారోగ్య కారణాలతో జనజీవన స్రవంతిలో కలిశారు. పోరుబాట వీడి కొంతకాలం పాటు మీడియాలో చేరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి పనిచేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పరకాల నియోజకవర్గం నుంచి టికెట్ కోసం ప్రయత్నించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అజ్ఞాతంలోనే ఉన్న మరొకరే గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్. నాలుగు దశాబ్దాల్లో అంచెలంచెలుగా కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004 అక్టోబర్‌లో జరిపిన శాంతి చర్చల్లో మావోయిస్టు పార్టీ తరపున ప్రతినిధిగా గాజర్ల రవి అలియాస్ గణేశ్ ఉన్నారు. ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో శాంతి చర్చల్లో పాల్గొన్నారు. శాంతి చర్చల ఎజెండాను తయారు చేయడంలో కామ్రేడ్ గాజర్ల రవి కీలక పాత్ర పోషించారు. ఎన్కౌంటర్ లో మృతిచెందిన గాజర్ల రవి అలియాస్ గణేశ్ పై 25 లక్షల రివార్డ్ ఉన్నది. పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తూ కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు.



# సాగునీటి ప్రాజెక్టులపై ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం

## -కెసిఆర్ అధ్యక్షతన త్వరలో బిఆర్ఎస్ నేతల భేటీ-తెలంగాణ రైతాంగం పక్షాన పోరాటానికి సిద్దం

**హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి)**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. త్వరలో పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం కానున్నారు. ఇక రైతుల పక్షాన మరో పోరాటానికి సిద్ధమవుతున్నారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా సమావేశం ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ చూపిస్తున్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంపై తెలంగాణ రైతాంగం తరపున పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ రెడీ అయింది. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంపై చర్చించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో త్వరలోనే కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నది. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం, రైతు వ్యతిరేక వైఖరిపై ప్రధానంగా చర్చిస్తారు. ÷రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం వహించడంపైన చర్చించనున్నారు. బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తి అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనబెట్టడంతో పాటు 2 పిల్లర్లు కుంగాయన్న సాకుతో మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను నాయకులకు కేసీఆర్ వివరిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో లక్షల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందకుండా పోతున్నది. రాజకీయ దురుద్దేశంతోనే అన్నదాతలపైన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్న నేపద్యంలో తదుపరి కార్యాచరణ పై చర్చించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా ప్రభుత్వం చూపుతున్న అలసత్వం వలన తెలంగాణకు తీరని నష్టం కలుగుతుందని, ఈ అంశంలో ఉద్యమ కార్యాచరణకు బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేయనుంది. ఏడాదిన్నర కాలంగా తెలంగాణ రైతులను నిండా ముంచుతున్న కాంగ్రెస్ ద్రోహాన్ని ఈ కీలక సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సమగ్రంగా చర్చించనున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం జరగనుంది. రైతుల కొరకు ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని నిర్ణయించారు. కాగా.. జూన్ 15న మాజీ మంత్రి హరీష్‌రావు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసిన విషయం తెలిసిందే. గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. అలాంటి వేళ.. తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదివారం లేఖ రాశారు. గోదావరి - బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ కారణంగా గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన 200 టీఎంసీల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్ట్ డిజైన్, కేంద్రానికి పీఎఫ్ఆర్ సమర్పించడం.. తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమేనని ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు ఆ లేఖలో స్పష్టం చేశారు.

# నా ఫోన్ ట్యాపింగ్ నిజం విచారణకు ఎక్కడికైనా వస్తా

## -జగన్, కెసిఆర్ బంధంతో రక్త సంబంధం మటాష్

## -మీడియాతో పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

**విశాఖపట్టణం,జూన్18(సమయజ్యోతి):**

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది పచ్చి నిజమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. తన ఫోన్‌తో పాటు భర్త, దగ్గర వాళ్ల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. విశాఖపట్నం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.'ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైవీ సుబ్బారెడ్డి నిర్ధరించారు. ఆనాడు ట్యాపింగ్ జరిగిన నా ఆడియో ఒకటి నాకే వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు ఎక్కడికి రమ్మన్నా వస్తా. తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ వేగవంతం చేయాలి. ఆనాడు జగన్, కేసీఆర్ మధ్య ఉన్న సంబంధం చూసి రక్త సంబంధం కూడా చిన్నబోయింది. ఫోన్ ట్యాపింగ్.. తెలంగాణలో నన్ను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకు ఆ ఇద్దరు కలిసి వేసిన స్కెచ్.

÷శిసీఆర్ కోసం జగన్ నన్ను తొక్కి పెట్టాలని చూశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తెలిస్తే మీరు ఏం చేశారు అని నన్ను అడగొచ్చు. ఆనాడు ఉన్న పరిస్థితులు వేరు. అప్పుడు జగన్, కేసీఆర్ చేసినవి అరాచకాలు. వీరి అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ చిన్నది. నేను జగన్‌కు తోడబుట్టిన చె÷-లలెల్ని. ఆ విషయం మరిచి నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదు అని కుట్ర చేశారు. నా భవిష్యత్తును పాతిపెట్టాలని ఎన్నో చేశారు. నాకు మద్దతు పలికిన వాళ్లను



బెదిరించారు. రాజకీయంగా నా వాళ్లు రానివ్వకుండా చేశారు. నేను తెలంగాణలో పార్టీ పెట్టడంలో జగన్‌కు ఏ సంబంధం లేదు. కేసీఆర్ కోసం నన్ను తొక్కి పెట్టాలని చూశారు. నా చుట్టూ పరిస్థితులను కష్టతరం చేశారు. నా ప్రతి పోరాటానికి అడ్డుపడ్డారు.' అని షర్మిల అన్నారు.

# మద్యం కేసులో కీలక పరిణామం

## చెవిరెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన పోలీసులు

## చెవిరెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డిని ఏ39గా నమోదు

**అమరావతి,జూన్18(సమయజ్యోతి):** ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఏ38గా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఇప్పుడు తాజాగా చెవిరెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డిని ఏ39గా చేర్చుతూ బుధవారం కోర్ట్‌కు మెమో పంపారు. మోహిత్ రెడ్డితో పాటు మరో మాజీ ఎంపీని కూడా నిందితుడిగా చేర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన డబ్బును చెవిరెడ్డి అందుకున్నట్టు సిట్ వద్ద ఆధారాలు ఉన్నాయి. మద్యం కమిషన్లను ఎన్నికల్లో అభ్యర్థులకు పంపిణీ చేశారని ఇప్పటికే సిట్ నిర్ధారించింది. ఈ డబ్బు అందుకున్న చెవిరెడ్డి ఆ మొత్తాన్ని కొంతమందికి పంపిణీ చేసినట్టు సిట్ వద్ద సమాచారం ఉంది. ఇందులో కొంత చంద్రగిరి నుంచి పోటీ చేసిన తన కుమారుడు మోహిత్ రెడ్డికి ఇచ్చినట్టు సిట్ గుర్తించింది. మరి కొంత డబ్బును గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన మరో మాజీ ఎంపీకు ఇచ్చినట్టు సిట్ వద్ద ఆధారాలు ఉన్నాయి. ఆ మాజీ ఎంపీని కూడా సాయంత్రంలోపు ఎఫ్ఐఆర్‌లో చేర్చే అవకాశం ఉంది. కాగా.. ఈ కేసులో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఆయన సన్నిహితుడు వెంకటేష్ నాయుడును బెంగళూరులో సిట్ అధికారులు అరెస్ట్ చేశారు.వారిద్దరినీ విజయవాడ తీసుకువచ్చిన అధికారులు.. సిట్ కార్యాలయంలో ప్రశ్నిస్తున్నారు. బెంగళూరు నుంచి ప్రయాణం చేసి రావడంతో కొద్దిసేపు విశ్రాంతి ఇచ్చిన అనంతరం చెవిరెడ్డిపై అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. మరోవైపు చెవిరెడ్డి రెండో కుమారుడు విజయవాడలోని సిట్ కార్యాలయానికి వచ్చారు. న్యాయవాదులతో కలిసి సిట్ ఆఫీస్‌కు వచ్చారు హర్షిత్ రెడ్డి. అయితే న్యాయవాదులను మాత్రమే లోనికి వెళ్లేందుకు అనుమతి ఇచ్చిన సిట్.. హర్షిత్ రెడ్డికి మాత్రం అనుమతి నిరాకరించారు. కాగా.. మద్యం కుంభకోణం కేసులో ఇప్పటి వరకు ఏడుగురిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. కేసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, దిలీప్, చాణుక్య, ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను సిట్ అరెస్ట్ చేసి.. కస్టడీలోకి తీసుకుని విచారించింది కూడా. వారి నుంచి వచ్చిన సమాచారం మేరకు మిథున్ రెడ్డి పాత్ర కూడా చాలా ప్రముఖంగా ఉన్నట్లు నిర్ధారించారు. అయితే ఆయన హైకోర్టులో ముందస్తుగా బెయిల్ పిటిషన్ వేయడంతో వాదనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రూ.5 కోట్లు మిథున్ రెడ్డి ఖాతాలో జమచేసినట్లు సిట్ అధికారులు గుర్తించి ఆ వివరాలను హైకోర్టుకు సమర్పించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అనూహ్యంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. కేసిరెడ్డితో మాజీ ఎమ్మెల్యే పలు దఫాలుగా సమావేశం అవడంతో పాటు ఎన్నికల ముందు కేసిరెడ్డి నుంచి కొన్ని కోట్లు తీసుకున్నట్లు సిట్ గుర్తించింది. ఒంగోలు ఎంపీగా పోటీ చేసిన సమయంలో, అతడి కుమారుడు ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో, మాజీ ఎంపీకి కూడా డబ్బులు పంపిణీ చేయడంలో చెవిరెడ్డి పాత్ర ఉన్నట్లు సిట్ అధికారులు నిర్ధారించారు. మొత్తం విచారణ జరిపిన అనంతరం ఆధారాలు సేకరించిన సిట్.. చెవిరెడ్డి, ఆయన సన్నిహితుడు వెంకటేష్ నాయుడిని అరెస్ట్ విజయవాడకు తీసుకువచ్చి కార్యాలయంలో విచారణ చేస్తున్నారు.

# బేగంపేటకు బాంబు బెదిరింపు కాల్

**హైదరాబాద్,జూన్18(సమయజ్యోతి):** బేగంపేట ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు కాల్ రావడం తీవ్ర కలకలం రేపింది. బుధవారం 10:30 గంటలకు బేగంపేట్ విమానాశ్రయంలో బాంబు ఉన్నట్లు కొందరు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సిబ్బంది బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వగా.. వెంటనే వారు అక్కడకు చేరుకుని ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. విమానాశ్రయంలోని ఉద్యోగులందరినీ బయటకు పంపించి బాంబు స్క్వాడ్, ఎస్పీఎఫ్ పోలీసులు క్షుణ్ణంగా సోదాలు చేశారు. అయితే విమానాశ్రయంలో ఎలాంటి బాంబు లేదని.. అదంతా ఫేక్ కాల్‌గా బాంబు స్క్వాడ్ గుర్తించింది. కాల్ చేసిన నెంబర్ ఆధారంగా ఆగంతకుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# ఇజ్రాయిల్‌లో జగిత్యాల వాసి మృతి

**జగిత్యాల,జూన్18(సమయజ్యోతి):** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇరు దేశాలు మధ్య జరుగుతున్న దాడుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ యుద్ధం వల్ల జగిత్యాలకు చెందిన రవీందర్ అనే వ్యక్తి మృతి చెందాడు. బతుకుదెరువు కోసం రెండు సంవత్సరాల క్రితం రవీందర్ ఇజ్రాయెల్‌కు వెళ్లాడు. అయితే యుద్ధం జరుగుతుండగా.. బాంబు శబ్దం వల్ల రవీందర్ గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రవీందర్ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యుద్ధం కారణంగా విమాన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రవీందర్ మృతదేహాన్ని ఎలాగైనా స్వదేశానికి రప్పించాలని కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# పోలీస్ ఆంక్షలు బేఖాతర్ చేసిన జగన్

## -పల్నాడు పర్యటనలో అపశృతి-కాన్వాయ్ ఢీకొని ఒకరు...సొమ్మసిల్లి మరొకరు మృతి


## -జగన్ తీరుపై సర్వత్రా విమర్శలు



**పల్నాడు,జూన్18(సమయజ్యోతి):** మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. జగన్ పర్యటనలో అపశృతి చోటు చేసుకుని ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే జగన్ కాన్వాయ్ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందగా.. ఇప్పుడు మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సత్తెనపల్లి గడియారం స్తంభం వద్ద ఆ పార్టీకి చెందిన కార్యకర్త సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు సత్తెనపల్లి కి చెందిన జయవర్ధన్ రెడ్డిగా గుర్తించారు. జయవర్ధన్ రెడ్డి సత్తెనపల్లిలో ఆటోమొబైల్ షాపును నిర్వహిస్తున్నాడు. అయితే క్లాక్ టవర్ వద్ద జగన్ రెడ్డి రాకతో ఒత్తిడి పెరిగింది. ఈ సమయంలో అక్కడే ఉన్న జయవర్ధన్ ఊపిరి ఆడక కిందపోయాడు. జగన్ కాన్వాయ్ వెళ్లాక వ్యక్తి పడిపోయి ఉండటాన్ని గుర్తించి తోటి కార్యకర్తలు అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. కాగా.. బుధవారం ఉదయం ఏటూకూరులో సింగయ్య అనే వృద్ధుడిని వైఎస్ జగన్ ప్రయాణిస్తున్న కాన్వాయ్ ఢీకొట్టింది. దీంతో అతడు మృతిచెందాడు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు భారీ కాన్వాయ్‌తో జగన్ బయలుదేరగా.. ఏటుకూరు బైపాస్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడు సింగయ్యను జగన్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సింగయ్య మృతి చెందాడు. అయితే వృద్ధుడిని ఢీకొన్న తర్వాత కూడా జగన్, వైసీపీ నేతలు పట్టించుకోకుండా వెళ్లిపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. నిబంధనలకు విరుద్ధంగా వందలాది వాహనాలతో బలప్రదర్శన చేస్తూ జగన్ రెంటపాళ్ల వస్తుండగా.. ఇప్పటికి ఇద్దరు వ్యక్తులు మరణించారు. జగన్ తాడేపల్లి నుంచి సత్తెనపల్లి చేరుకుని రెంటపాళ్లకు వెళ్లకముందే ఇద్దరు చనిపోయిన ఘటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జగన్ పర్యటనలో వంద మందికి మాత్రమే అనుమతి ఇస్తామని పోలీసులు చెప్పినప్పటికీ వందలాది వాహనాలతో, వేలాది మంది కార్యకర్తలతో తరలివచ్చి చావులకు కారణం అవడంపై సత్తెనపల్లితో పాటు పల్నాడు జిల్లాకు చెందిన ప్రజలు జగన్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.----

# ఉపరాష్ట్రపతి ధన్‌కడ్‌తో లోకేశ్ భేటీ

## మర్యాదపూర్వకంగానే కలిసినట్లు వెల్లడి



**న్యూఢిల్లీ,జూన్18(సమయజ్యోతి):** ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ హోంమంత్రి అమిత్ షా, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్‌లతో భేటి అయ్యారు. బుధవారం ఉదయం నుంచి దేశ రాజధాని ఢిల్లీలో మంత్రి నారా లోకేష్ పర్యటన కొనసాగింది. ఉదయం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌తో మంత్రి భేటీ అయ్యారు. అయితే మర్యాద పూర్వకంగానే ఉపరాష్ట్రపతిని కలిసినట్లు లోకేష్ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. అమరావతిలో నిర్మించ తలపెట్టిన అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు కొత్త భవనాల్లో కొన్నింటికి వైస్ ప్రెసిడెంట్‌తో శంకుస్థాపన చేయించాలని సీఎం చంద్రబాబు నాయుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఉపరాష్ట్రపతిని ఏపీకి రావాల్సిందిగా లోకేష్ ఆహ్వానించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మంత్రి లోకేష్‌తో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్, బైరెడ్డి శబరి.. ఉపరాష్ట్రపతిని కలిశారు. పలువురు కేంద్రమంత్రులతో లోకేష్ సమావేశం కానున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీకానున్నారు. ఇది చాలా కీలకమైన సమావేశం. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌లో ఏపీకి చెందిన నేతల ఫోన్లు కూడా ట్యాప్ అయినట్లు సమాచారం. దీనిపై ప్రధానంగా కేంద్రమంత్రితో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఏపీ లిక్కర్ కేసులో జరుగుతున్న పరిణామాలపై కేంద్ర హోంమంత్రికి వివరించనున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మాజీ సీఎం జగన్‌కు సంబంధించిన వ్యవహారాలపై ఎక్కువగా చర్చించి అవకాశం ఉన్నట్లు సమాచారం.



# గన్ పర్యటనలో.. మాజీ మంత్రి అంబటి హల్‌చల్

## -బారికేడ్లు విసిరి..పోలీసులపై దురుసు ప్రవర్తన-అంబటిని ఘాటుగా హెచ్చరించిన పోలీసులు

**పల్నాడు,జూన్18(సమయజ్యోతి):** మాజీ సీఎం జగన్ పల్నాడు పర్యటనలో.. మాజీ మంత్రి అంబటి రాంబాబు రెచ్చిపోయారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న బారికేడ్‌లను విసిరిపడేశారు. అంతే కాకుండా, అడ్డుకోబోయిన పోలీసులపై కూడా దౌర్జన్యంగా ప్రవర్తించారు. దీంతో డీఎస్పీ నాగేశ్వరరావు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే తాట తీస్తామని హెచ్చరించారు. పిచ్చి వేశాలు వేస్తే అరెస్ట్ చేస్తామన్నారు. బారికేడ్‌లు తొలగింపుపై మండిపడిన డీఎస్పీ అంబటిపై చర్యలు తీసుకుంటామన్నారు.వైసీపీ అధినేత జగన్ పల్నాడు పర్యటనలో ఆందోళనకర పరిస్థితులు కనిపించాయి. సత్తెన్నపల్లి పట్నంలో ఓ సీఐపై వైసీపీ మూకలు దౌర్జన్యం చేశారు. అంతేకాకుండా, ఆర్టీసీ బస్సుపై దాడి చేశారు. పల్నాడు, గుంటూరు జిల్లా సరిహద్దులో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద మాజీ మంత్రి అంబటి హల్‌చల్ చేశారు. బారికేడ్లను ఎత్తివేసి వీరంగం సృష్టించారు. నిబంధనలకు విరుద్ధంగా అంబటి ర్యాలీ చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన అంబటి బారికేడ్లను రోడ్డుపై నుంచి తోసిపడేశారు. మాజీ మంత్రి, అతని సోదరుడు మురళి కలిసి రోడ్డుపై అడ్డంగా పెట్టి ఉన్న బారికేడ్‌లు విసిరిపడేశారు. వీరిని అడ్డుకోబోయిన పోలీసులపై అంబటి రాంబాబు దౌర్జన్యంగా ప్రవర్తించారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా ఏకంగా పోలీసులకే అంబటి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఆపై అంబటి సోదరులు బారికేడ్‌లు తొలగించి వైసీపీ కార్యకర్తలను ముందుకు పంపించారు. కాగా.. జగన్ రెడ్డి పల్నాడు పర్యటన మొత్తం అరాచకాలు, దౌర్జన్యాలతో ముందుకు సాగుతోంది. సత్తెన్నపల్లి పట్నంలో ఓ సీఐపై వైసీపీ మూకలు దౌర్జన్యం చేసి అతడిని నెట్టివేయగా.. మరోవైపు ఆర్టీసీ బస్సుపై జెండా కర్రలతో దాడి చేశారు. పల్నాడు, గుంటూరు జిల్లా సరిహద్దులో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద మాజీ మంత్రి హల్‌చల్ చేశారు. బారికేడ్లను తోసివేసి.. ఆంక్షలు విధించిన పోలీసులపై దౌర్జన్యం చేస్తూ వైసీపీ కేడర్‌ను సత్తెనపల్లి వైపు వెళ్లేలా వీరంగం సృష్టించారు. నిబంధనలకు విరుద్ధంగా అంబటి భారీ ర్యాలీగా రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన అంబటి.. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను రోడ్డుపై నుంచి తోసిపడేశారు. జగన్ పల్నాడులోకి ప్రవేశించాక.. ఆయనతో పాటు వచ్చిన కార్యకర్తలు, కేడర్ వాహనాలను పల్నాడు వద్ద బార్డర్‌లో బారికేడ్లు పెట్టి నిలిపివేశారు. అదే రోడ్డులో వస్తున్న అంబటి రాంబాబు, అతని సోదరుడు అంబటి మురళి.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారిద్దరినీ పంపిస్తామని పోలీసులు చెప్పినప్పటికీ బారికేడ్లను స్థానిక నేతలతో కలిసి సోదరులు ఇద్దరు బారికేడ్లను లాగిపడేస్తూ పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. నర్సరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావుకు పోలీసుల అంతు తేలుస్తాం అంటూ వార్నింగ్ ఇచ్చారు. కొద్ది రోజుల క్రితం వైసీపీ చేపట్టిన వెన్నుపోటు దినోత్సవంలో కూడా పట్టాభిపురం సీఐపై కూడా అంబటి రాంబాబు ఇదే విధంగా దురుసుగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. పోలీసుల పట్ల అంబటి రాంబాబు ప్రవర్తిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# 17మంది ఖైదీలకు విముక్తి

## సత్ప్రవర్తన మీద విడుదల చేస్తూ ఆదేశాలు

**అమరావతి,జూన్18(సమయజ్యోతి):** రాష్ట్ర వ్యాప్తంగా పలు జైళ్లలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తోన్న 17 మంది సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. జైళ్లశాఖ ఎంపిక చేసిన 17 మంది సత్ప్రవర్తన కలిగిన ఖైదీల జాబితా రూపొందించగా దాన్ని హోం శాఖ పరిశీలన అనంతరం మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. 2025 ఫిబ్రవరి 1 వరకు నిర్ణీత కాలంలో శిక్ష అనుభవిస్తోన్న ఖైదీలను విడుదల చేయాలని నిర్ణయించారు. జీవిత ఖైదీల మిగిలిన శిక్షను షరతులకు లోబడి రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాల్లో తెలిపింది. ఖైదీల ముందస్తు విడుదలకు రూ.50 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని షరతు విధించింది. విడుదలైన తర్వాత ఖైదీలు శిక్ష పూర్తయ్యే వరకు పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. 3 నెలలకు ఒకసారి ప్రొబేషన్ అధికారి ముందు హాజరు కావాలని నిర్దేశించింది. విడుదలైన ఖైదీలు ఏదైనా నేరానికి పాల్పడితే తిరిగి అరెస్టు చేయాలని ప్రభుత్వం ఆదేశాల్లో స్పష్టం చేసింది.

# ఇజ్రాయిల్ మూల్యం చెల్లించుకోక తప్పదు

## -ట్రంప్ మితిమీరితే ఆయనకూ ఇదే గతి-వీడియో సందేశంలో హెచ్చరించిన ఖొమేనీ

**టెహ్రాన్,జూన్18(సమయజ్యోతి):** తమపై దాడి చేసి ఇజ్రాయెల్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ హెచ్చరించింది. దాడి చేయడం ద్వారా ఇజ్రాయిల్ భారీ తప్పిదం చేసిందని, అందుకు శిక్ష తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడుల వేళ వీడియో సందేశం విడుదల చేసిన ఆయన.. ఇరాన్ లొంగిపోదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఉద్దేశిస్తూ.. అటువంటి బెదిరింపులకు భయపడమనే విషయం ఇరాన్ చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుందన్నారు. అంతేకాదు అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం ఉంటుందన్న విషయం అమెరికన్లు తెలుసుకోవాలన్నారు. ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న పోరులో అమెరికా జోక్యం చేసుకుంటే అది పశ్చిమాసియాలో విస్తృత యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి కూడా హెచ్చరించారు. ఘర్షణల నేపథ్యంలో తొలిసారి స్పందించిన ఆయన.. తమపై దాడులకు దీటుగా స్పందిస్తామన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని.. ఆయన సురక్షితంగా ఉన్నారని చెప్పారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను చంపాలనుకోవడం లేదన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేదంటే పరిస్థితులు తీవ్రంగా మారుతాయని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఖమేనీ ఈ విధంగా స్పందించారు.

# వన్డేల్లో కొత్త కెప్టెన్‌ను బీసీసీఐ నియమించే అవకాశం

రోహిత్ శర్మ ఇటీవల టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. అంతకుముందు2024 టీ20 ప్రపంచ కప్ తర్వాత రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో టీం ఇండియా ఓటమి తర్వాత రోహిత్ టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకోవడం ప్రతికూల ప్రభావం చూపనుంది. తాజాగా వన్డే క్రికెట్ నుంచి కూడా రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ వన్డే ఫార్మాట్లో రోహిత్ శర్మ కొనసాగినా కెప్టెన్సీ మార్పు జరిగే అవకాశం ఉందని ప్రచారం జోరందుకుంది. భారత క్రికెట్ నియంత్రణ బోర్డురోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించి, యువ ఆటగాళ్లకు బాధ్యత అప్పగించే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ రోహిత్ శర్మ ఈ 50 ఓవర్ల ఫార్మాట్ నుంచి రిటైర్ అయితే, వన్డేల్లో భారత జట్టుకు ఎవరు కెప్టెన్ అవుతారో చూడాలి. భారత వన్డే జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. ఇటీవల టెస్టులకు వీడ్కోలు పలికాడు. ఒకవేళ వన్డేల నుంచి రోహిత్ శర్మ రిటైర్ అయితే, పరిస్థితి ఏంటని పెద్ద ప్రశ్న తలెత్తవచ్చు. ఇటీవల శుభ్‌మాన్ గిల్‌ను భారత టెస్ట్ జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. గిల్ పేరుతో పాటు జస్‌ప్రీత్ బుమ్రా, రిషబ్ పంత్ పేర్లు వినిపించగా.. చివరికి హెడ్ కోచ్ గౌతం గంభీర్, సెలెక్టర్లు గిల్ వైపు మొగ్గుచూపారు. రోహిత్ శర్మ తర్వాత, వన్డేల్లో భారత జట్టు కెప్టెన్ రేసులో ఐదుగురు ఆటగాళ్ల పేర్లు పరిశీలించే అవకాశం ఉంది. వారు గిల్, హార్దిక్ పాండ్యా, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్. అయతే రాహుల్ కు పగ్గాలు ఇచ్చే అవకాశం తక్కువే. పాండ్యా తరచు గాయాలపాలవుతుంటాడు. గిల్, అయ్యర్, పంత్ మధ్య వన్డే కెప్టెన్సీ కోసం పోటీ ఎదురవుతుంది. టెస్టులకు ఎలాగూ కెప్టెన్ చేశారు కనుక శుభ్‌మన్ గిల్ వన్డేల్లోనూ సారథ్య బాధ్యతలు అందుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయి. రిషబ్ పంత్, అయ్యర్‌ల నుంచి గిల్‌కు పోటీ ఎదురవ్వొచ్చు. ఒక్కో ఫార్మాట్ కు ఒక్కో కెప్టెన్ బదులుగా రోహిత్ ఉన్న సమయంలోనే కెప్టెన్సీ పగ్గాలు మరో ప్లేయర్‌కు దక్కడాన్ని కొట్టిపారేయలేం. వన్డేల్లో కెప్టెన్‌గా రేసులో అయ్యర్ పేరు కచ్చితంగా ఉంటుంది. ఐపీఎల్ గత 4 ఐపీఎల్ సీజన్లలో కెప్టెన్‌గా తానేంటో నిరూపించుకున్నాడు. బ్యాటర్‌గానూ సత్తా చాటుతున్నాడు. దేశవాలీలోనూ మ్యాచ్‌లాడి మరింత రాటుదేలాడు. గిల్, అయ్యర్‌లలో ఎవరికి పగ్గాలు అప్పగిస్తారో నని క్రికెట్ ప్రేమికులు అప్పుడే డిస్కషన్ మొదలుపెట్టారు. భారత జట్టుకు ప్రస్తుతం 3 ఫార్మాట్లలో ముగ్గురు వేర్వేరు కెప్టెన్లు ఉన్నారు. వన్డేల్లో రోహిత్ శర్మ, టెస్టుల్లో కొత్త కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ బాధ్యతలు చేపట్టాడు. సూర్యకుమార్ యాదవ్ టీ20ల్లో భారత జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు. రోహిత్ శర్మ వచ్చే వన్డే వరల్డ్ కప్ వరకు ఆడతాడని అతడి సన్నిహితులు చెబుతున్నారు. కానీ కెప్టెన్‌గా హిట్ మ్యాన్‌నే కొనసాగిస్తారని ఎవరూ గ్యారంటీ ఇవ్వలేరు.






# సూపర్ సెంచరీతో మ్యాక్స్‌వెల్ వరల్డ్ రికార్డ్

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్?వెల్ అదరగొట్టాడు. అమెరికా డొమెస్టిక్ లీగ్ మేజర్ లీగ్ క్రికెట్?లో జరిగిన తాజా మ్యాచ్?లో మ్యాక్సీ విధ్వంసం సృష్టించాడు. ఈ టోర్నీలో వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మ్యాక్స్?వెల్, లాస్ ఏంజెలెస్?తో జరిగిన మ్యాచ్?లో సెంచరీతో కదం తొక్కాడు. 49 బంతుల్లోనే 106 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ రికార్డ్? సమం చేశాడు.టీ20 కెరీర్?లో తాజా సెంచరీ మ్యాక్స్?వెల్?కు ఎనిమిదో శతకం. దీంతో టీ20 క్రికెట్?లో అత్యధిక శతకాలు బాదిన నాలుగో బ్యాటర్?గా నిలిచాడు. ఈ క్రమంలోనే స్టార్లు రోహిత్ శర్మ, డేవిడ్ వార్నర్, ఆరోన్ ఫించ్, జాస్ బట్లర్ రికార్డును సమం చేశాడు. ఈ నలుగురు ప్లేయర్లు కూడా టీ20ల్లో ఇప్పటికే నాలుగేసి శతకాలు బాదారు. తాజా ఇన్నింగ్స్?తో మ్యాక్స్?వెల్ ఈ స్టార్ ప్లేయర్ల సరసన చేరాడు. ఈ లిస్ట్?లో 22 సెంచరీలతో వెస్టిండీస్ స్టార్ క్రిస్ గేల్ టాప్?లో ఉన్నాడు. ఆ తర్వాత బాబర్ అజామ్ (11), టీమ్ఇండియా స్టార్ విరాట్ కోహ్లీ (9), రెలీ రొసోస్ (9) ఉన్నారు. ఈ ఇన్నింగ్స్?తో మ్యాక్స్?వెల్ టీ20ల్లో 10500 పరుగులు పూర్తి చేసుకున్నాడు. అలాగే అతడి ఖాతాలో 170 టీ20 వికెట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆసీస్ స్టార్ వరల్డ్? రికార్డ్ సాధించాడు. టీ20ల్లో 10500 పరుగులు, 170o వికెట్లు, ఐదు సెంచరీలు సాధించిన ఏకైక ప్లేయర్?గా రికార్డు నెలకొల్పాడు.ఇక మ్యాక్సీ ఇన్నింగ్స్? విషయానికొస్తే, ఈ మ్యాచ్?లో తొలి 15 బంతుల్లో 11 పరుగులే చేశాడు. ఆ తర్వాత 34 బంతుల్లో 95 రన్స్?తో రఫ్ఫాడించాడు. ఈ ఇన్నింగ్స్?లో 2 ఫోర్లు, ఏకంగా 13 సిక్స్?లతో బీభత్సం సృష్టించాడు. దీంతో వాషింగ్టన్ 208 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో లాస్ ఏంజెలెస్ 95 పరుగులకే కుప్పకూలింది.



# పేసర్ హర్షిత్ రాణాకు గోల్డెన్ ఛాన్స్

## భారత్- ఇంగ్లాండ్ టెస్టు సిరీస్ కు ఎంపిక

టీమ్ఇండియా యంగ్ పేసర్ హర్షిత్ రాణాకు గోల్డెన్ ఛాన్స్ దక్కింది. అతడు ఇంగ్లాండ్ టెస్టు సిరీస్?లో తొలి మ్యాచ్?కు ఎంపికయ్యాడు. భారత్ జట్టులో అతడిని చేర్చుతున్నట్లు బీసీసీఐ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు ఓ పోస్ట్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. 'ఇంగ్లాండ్?తో తొలి టెస్టు కోసం హర్షిత్ రానా టీమ్ఇండియాతో చేరనున్నాడు' అని ట్వీట్ చేసింది.అయితే ఇటీవల ఇండియా ఏ జట్టుకు ఎంపికైన హర్షిత్ ప్రస్తుతం ఇంగ్లాండ్?లోనే ఉన్నాడు. అక్కడ ఇండియా ఏ తరఫున ఆడిన రాణాను బీసీసీఐ తిరిగి భారత్?కు పంపలేదు. అలాగే వర్క్ లోడ్ కారణంగా బుమ్రా ఆడని మ్యాచ్?ల్లో హర్షిత్ బరిలో దిగే ఛాన్స్ ఉంది. కాగా, హర్షిత్ గతేడాది ఆస్ట్రేలియా సిరీస్?లో టెస్టు అరంగేట్రం చేశాడు. కానీ ఆ సిరీస్?లో పెద్దగా ప్రభావం చూపలేదు. 2 మ్యాచ్?ల్లో నాలుగే వికెట్లు పడగొట్టాడు.తొలి టెస్టుకు భారత జట్టు : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా

భారత్‌తో తొలి టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు : షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్సే, సామ్ కుక్, జాక్ క్రాలే, బెన్ డకెట్, జామీ ఓవర్‌టన్, ఆలీ పోప్, జో రూట్, జామీ స్మిత్ (వికెట్), బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోష్ టోక్స్, క్రిస్

# అనికేత్ వర్మ అద్భుత ప్రదర్శన

ఐపీఎల్ 2025వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (జట్టు కావ్య మారన్ సారథ్యంలో కొనుగోలు చేసిన యువ ఆటగాడు అనికేత్ వర్మ, మహారాష్ట్ర ప్రీమియర్ లీగ్ 2025లో తన సత్తా చాటాడు. అయితే, అతని అద్భుతమైన బ్యాటింగ్‌కు వానదేవుడు అడ్డు తగిలాడు. పుణెలో జరుగుతున్న 2025లో ఈ సంఘటన జరిగింది. అనికేత్ వర్మ కేవలం 39 బంతుల్లోనే 91 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి, తాను ఎందుకు ఇంతటి చర్చనీయాంశంగా మారాడో నిరూపించాడు. ఈ ఇన్నింగ్స్‌లో అనికేత్ 7 బౌండరీలు, 7 భారీ సిక్సర్లు బాది, మైదానం నలుమూలలా పరుగులు పిండుకున్నాడు. అతని బ్యాటింగ్ దూకుడు చూస్తుంటే, సులభంగా సెంచరీ సాధించేలా కనిపించాడు. అనికేత్ వర్మ అద్భుతమైన బ్యాటింగ్‌తో అతని జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తున్న సమయంలో, వర్షం అంతరాయం కలిగించింది. దీంతో మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. అనికేత్ శతకాన్ని మిస్ చేసుకోవడం, అతని అభిమానులతో పాటు క్రికెట్ ప్రేమికులందరికీ నిరాశను కలిగించింది. అయినప్పటికీ, అతని ఈ మెరుపు ఇన్నింగ్స్ అతని ప్రతిభను మరోసారి చాటి చెప్పింది.



# కోహ్లీ, రోహిత్ లేని లోటును గిల్ భర్తీ చేయగలడు

## గిల్‌పై జోస్ బట్లర్ ప్రశంసల జల్లు

టీమిండియా నయా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ ప్రశంసల జల్లు కురిపించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల నైపుణ్యాలు ఒక్కటైతే శుభ్‌మన్ గిల్ అని కొనియాడాడు. కోహ్లీ, రోహిత్ లేని లోటును గిల్ భర్తీ చేయగలడని అభిప్రాయపడ్డాడు. భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్ట్‌ల సిరీస్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. అయితే కోహ్లీ, రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమిండియా ఈ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ నేపథ్యంలో మాట్లాడిన బట్లర్.. శుభ్‌మన్ గిల్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'శుభ్‌మన్ గిల్ అద్భుతమైన ఆటగాడు. మాట్లాడేటప్పుడు అతను చాలా ప్రశాంతంగా కనిపిస్తాడు. కానీ మైదానంలో దూకుడుగా ఉంటాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కలిస్తే శుభ్‌మన్ గిల్ అనేది నా అభిప్రాయం. అతను ఈ ఇద్దరి దిగ్గజాల నుంచి ఎంతో నేర్చుకున్నాడు. కానీ చాలా వరకు తన ఆటపై సొంత ముద్ర వేసుకున్నాడు.టెస్ట్ క్రికెట్‌లో సారథ్యం వహించడం అంటే దేశంలో మూడో లేదా నాలుగో వ్యక్తికి దక్కే అత్యంత ప్రభావవంతమైన హోదా లాంటిది. శుభ్‌మన్ గిల్ క్రీజులో ఉన్నప్పుడు బ్యాటర్‌గా ఉండాలని కోరుకుంటాడు. ఆ తర్వాతే అతను తన కెప్టెన్సీపై ఫోకస్ పెడుతాడు. బ్యాటింగ్ సమయంలో ఎలాంటి ఒత్తిడి తీసుకోడు. రెండు పాత్రలకు న్యాయం చేయాలని ప్రయత్నిస్తాడు.ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ చూసి అవాక్కయ్యాను. వయసులో నా కంటే అతను 20 ఏళ్లు చిన్నవాడు. కానీ అతను తన బ్యాటింగ్‌తో యావత్ క్రికెట్ ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యానికి గురి చేశాడు. 35 బంతుల్లో సెంచరీ చేశాడు.'అని ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో స్టువర్ట్ బ్రాడ్ చెప్పుకొచ్చాడు

## టెస్టు కెప్టెన్సీని నేనే వద్దనుకున్నా

### స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా

టీమ్ఇండియా స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ టెస్టులకు గుడ్ బై చెప్పడంతో జట్టుకు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రానే కెప్టెన్ అవుతాడని అందరూ భావించారు. అప్పటికే రోహిత్?కు డిప్యూటీగా ఉన్న బుమ్రాకు సెలక్టర్లు కెప్టెన్?గా ప్రమోషన్ ఇవ్వడం పక్కా అనుకున్నారు. కానీ, యంగ్ బ్యాటర్ శుభ్?మన్ గిల్? వైపు మొగ్గు చూపిన సెలక్షన్ కమిటీ అతడికి జట్టు పగ్గాలు అప్పగించింది. దీంతో సీనియర్ బుమ్రాను కాకుండా గిల్?కు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దీనిపై బుమ్రా తాజాగా స్పందించాడు. టెస్టు కెప్టెన్సీని తానే వద్దనుకున్నట్లు బుమ్రా తెలిపాడు. ఈ విషయాన్ని బీసీసీఐకు ఐపీఎల్ సమయంలోనే చెప్పినట్లు పేర్కొన్నాడు. రీసెంట్?గా మాజీ ప్లేయర్ దినేశ్ కార్తీక్‌తో ఓ టీవీ కార్యక్రమంలో బుమ్రా మాట్లాడాడు. ఈ సందర్భంగా తాను టెస్టు కెప్టెన్సీని తిరస్కరించడానికి కారణాలు చెప్పాడు. వర్క్? లోడ్ కారణంగానే కెప్టెన్సీ వద్దనుకున్నానని చెప్పాడు. నాయకత్వం కన్నా బౌలింగ్‌కే ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నట్లు వివరించాడు.





# కియారా కోసం యష్ త్యాగం

కేజీఎఫ్' సిరీస్ ద్వారా దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న కన్నడ స్టార్ యష్.. తన కొత్త ప్రాజెక్ట్ 'టాక్సిక్' కోసం మరింత ఆసక్తికరంగా ప్రిపేర్ అవుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా, ఇప్పటికే యష్ బర్త్‌డే స్పెషల్‌గా విడుదలైన గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ లభించింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ కూడా నటిస్తున్నారు. అయితే చిత్ర షూటింగ్ మొదలైన కొద్దికాలానికే కియారా గర్భవతిగా మారిన విషయం తెలిసిందే. అయితే గర్భవతిగా ఉన్న కియారాకు షూటింగ్ షెడ్యూల్ సులభంగా ఉండాలనే ఉద్దేశంతో, యష్ తన భాగమైన కొన్ని ముఖ్యమైన సన్నివేశాల షూటింగ్‌ను, బెంగళూరులో కాకుండా, ముంబైకి మార్చాలని నిర్ణయించారట. దీంతో ఆమెకు ప్రయాణ బాధ్యత తగ్గింది. ముంబైలోనే యష్, కియారాల మధ్య సన్నివేశాలను, త్వరగా షూట్ చేసి పూర్తి చేశారట. ఈ విషయం బయటకు వచ్చాక, యష్ సెన్సిటివిటీ, సహనభావం చూసిన ప్రేక్షకులు, అభిమానులు ఆయన పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక నటీమణి ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, షూటింగ్ లొకేషన్ మార్చడం నిజంగా అరుదైన విషయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ఈ భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.





## రాజాసాబ్ ..ఓ ఎమోషనల్ స్టోరీ
## చిత్రకథపై దర్శకుడు మారుతి

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్' బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ ఫిల్మ్‌గా సిద్ధమవుతోంది. ఈ సినిమా కథను ఉద్దేశించి దర్శకుడు మారుతి జాతీయ మీడియాతో మాట్లాడారు. ఇదొక ఎమోషనల్ స్టోరీ అని చెప్పారు. ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారన్నారు. ఇలాంటి కాన్సెప్ట్ ఇండియన్ స్క్రీన్స్‌పై ఇప్పటివరకూ రాలేదన్నారు. 'ఇదొక ఎమోషనల్ ఫిల్మ్. ఎన్నో భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. తాతయ్య, నానమ్మ, మనవడి కథను ఇందులో చూపించనున్నాం. స్క్రీన్‌పై చూసిన తర్వాత ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారు' అని మారుతి తెలిపారు.'హవేలి రాజ్‌మహల్' సెట్, వీఎఫ్ఎక్స్ వర్క్‌ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'ప్రభాస్ చిత్రాలకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని, కథకు అనుగుణంగా భారీ సెట్స్ ఏర్పాటుచేశాం. వీఎఫ్ఎక్స్ విషయానికి వస్తే.. ప్రభాస్ సినిమాపై ప్రేక్షకుల్లో ఒక అంచనా ఉంటుంది. దానికి తగ్గట్టుగా వీఎఫ్ఎక్స్ వర్క్‌పై దృష్టిపెట్టాను. అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. నిర్మాణ సంస్థ కూడా బడ్జెట్ విషయంలో ఎక్కడా వెనుకాడలేదు. ప్రేక్షకులను మేము మోసం చేయాలనుకోవడం లేదు. వాస్తవికతకు వీఎఫ్ఎక్స్‌ను జోడించాలనేదే మా ఉద్దేశం. పూర్తిస్థాయిలో ఒక అబద్ధపు ప్రపంచాన్ని సృష్టించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు' అని ఆయన చెప్పారు. సినిమా కోసం ప్రభాస్ ఎంతో శ్రమించారన్నారు. ప్రేక్షకులకు అద్భుతమైన చిత్రాన్ని అందించేందుకు ఆయన అన్నివిధాలుగా కష్టపడుతుంటారని వివరించారు. డిసెంబర్ 5న పాన్‌ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా టీజర్ విడుదలైంది. ప్రభాస్ వింటేజ్ లుక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సుమారు 3 గంటల నిడివితో ఇది విడుదల కానుందని టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో మారుతి తెలిపారు. 'రాజాసాబ్' కోసం నిర్మించిన హవేలి రాజ్‌మహల్ సెట్‌ను టీమ్ ఇప్పటికే మీడియాకు చూపించింది. దాదాపు రూ.7 కోట్లకు పైగా ఖర్చుతో ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ నిర్మించిన ఆ సెట్ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

## విశ్వంభరలో సాంగ్ మ్యూజిక్ భీమ్స్‌కు అప్పగింత

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్నసినిమాలలో విశ్వంభర ఒకటి. బింబిసారా దర్శకుడు వసిష్ఠ మల్లిడి డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమా సోషియో ఫాంటాషి నేపథ్యంలో తెరకెక్కుతుంది. చిరు సరసన కోలీవుడ్ స్టార్ బ్యూటీ త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి స్పందన లభించింది. చాలా కాలంగా సెట్స్ పై ఉన్న విశ్వంభర ఎప్పుడో విడుదల కావాల్సి ఉంది. కానీ కొంత రీషూట్స్ మరికొంత రీ వర్క్ చేస్తున్నారు. ఈ సినిమాకు ఆస్కార్ విన్నర్ ఎం ఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర ఫస్ట్ లిరికల్ ' రామ రామ' అనే సాంగ్ ను కూడా రిలీజ్ చేసారు. అయితే ఇప్పుడు ఈ సినిమా కోసం కీరవాణిని కాదని మరొక యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ వర్క్ చేయబోతున్నాడు. సంక్రాంతికి వస్తున్నాం, ధమాకా వంటి సూపర్ హిట్ ఆల్బమ్స్ ఇచ్చిన భీమ్స్ సిసిరోలియో విశ్వంభరకు సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాలో ఓ స్పెషల్ మాస్ సాంగ్ ను కంపోజ్ చేసే భాద్యతలు భీమ్స్ కు అప్పగించింది టీమ్. అందుకోసం వర్క్ కూడా స్టార్ట్ చేసాడు భీమ్స్. మిగిలిన సినిమా మొత్తం షూటింగ్ ఫినిష్ చేసారు. భీమ్స్ చేసే సాంగ్ షూట్ ఒక్కటే బ్యాలెన్స్ ఉంది. మరి చిరు కోసం భీమ్స్ ఎటువంటి సాంగ్ ఇస్తాడో చూడాలి. సోషియో ఫాంటాసి కథ నేపథ్యంలో సాగే ఈ సినిమా రిలీజ్ డేట్ ఎప్పుడు అనేది క్లారిటీ లేదు.

### చిరును డ్రిల్ మాస్టర్ చేసిన అనిల్ రావిపూడి

అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ సినిమా రూపొందుతున్నది. సంక్రాంతికి వస్తున్నాం మూవీ తర్వాత అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్నా ఈ సినిమాపై ఇప్పటి నుండే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను భారీ చిత్రాల నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి,సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిరు సరసన నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముస్సోరీలో జరుగుతోంది.




## జూలై 25కు కింగ్‌డమ్ లాక్ అయ్యిందా?



విజయ్ దేవరకొండ కెరీర్‌లో తెరకెక్కుతున్న అత్యంత కీలకమైన చిత్రం 'కింగ్‌డమ్'. తాజా సమాచారం ప్రకారం, 'కింగ్‌డమ్' సినిమా జూలై 25న, శుక్రవారం విడుదల కానుందని ఓ వార్త వైరల్ అవుతుంది. అధికారికంగా ఈ విషయంపై మేకర్స్ ప్రకటించనప్పటికీ, ఆ డేట్‌కే సినిమాను ప్లాన్ చేశారని ప్రచారం సాగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీగా అంచనాలు ఉన్నాయి. గతంలో లైగర్, ఫ్యామిలీ స్టార్ వంటి ఫ్లాప్స్ కారణంగా.. విజయ్ మార్కెట్ మీద చాలా ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో 'కింగ్‌డమ్' ద్వారా తన కెరీర్‌ను మళ్లీ పైకి తీసుకెళ్లాలన్న నమ్మకంతో విజయ్ అడుగులు వేస్తున్నాడు. ఇక ఈ చిత్రానికి జెర్సీ వంటి హిట్‌ను అందించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే ఇది అత్యధిక బ్జడెట్ కలిగిన పాన్ ఇండియా చిత్రం. ఇక ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజయ్ లుక్ అన్నీ కలిసి సినిమాపై పాజిటివ్ బజ్ తెచ్చాయి. అయితే, టీజర్ తర్వాత ఎలాంటి ప్రమోషనల్ మెటీరియల్ విడుదల కాలేదు. పాటలు, ట్రైలర్ లేదా మీడియా ఈవెంట్లపై ఎటువంటి అప్‌డేట్లు లేకపోవడం కొన్ని అనుమానాలు మొదలయ్యాయి. సాధారణంగా ఇలాంటి భారీ చిత్రాలు విడుదలకు రెండు నెలల ముందే సాంగ్స్, ఈవెంట్లు మొదలవుతాయి. కానీ 'కింగ్‌డమ్' మేకర్స్ ఇప్పటికీ ప్రమోషనల్ కార్యక్రమాలపై మౌనమే పాటిస్తున్నారు. ఫ్యాన్స్ మాత్రం చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన కోసం ఆతురతగా ఎదురుచూస్తున్నారు. తన కెరీర్‌ను మళ్లీ నిలబెట్టుకోవాలనుకునే విజయ్ దేవరకొండకు ఈ సినిమా ఎంతో ముఖ్యం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685